గురువారం
02-11-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 131
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

97 శాతం రూ.2వేల నోట్లు వెనక్కి: ఆర్బీఐ

ముంబై: చలామణీలో ఉన్న 97 శాతం రూ.2వేల నోట్లు వెనక్కి వచ్చినట్లు భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) తెలిపింది. రూ.10 వేల కోట్లు విలువైన నోట్లు మాత్రమే ప్రజల చేతుల్లో ఉన్నట్లు పేర్కొంది. నోట్లను ఉపసంహరించుకున్న సమయానికి రూ.3.56 లక్షల కోట్ల విలువైన నోట్లు చలామణిలో ఉండగా అక్టోబరు 31కి ఆ సంఖ్య 10వేల కోట్లకు తగ్గిందని ఆర్బీఐ తెలిపింది.ప్రస్తుతం ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల వద్ద పనివేళల్లో పెద్ద క్యూలు దర్శనమిస్తున్నాయి. ఒకవేళ రూ.2వేల నోట్లు ఉంటే తపాలా శాఖ ద్వారా తమ శాఖలకు పంపించొచ్చని ఆర్బీఐ పేర్కొంది.

ఎన్నికల బాండ్లలో 57శాతం బీజేపీకే

ఆ పార్టీ ఖాతాకు రూ.5,272 కోట్లు

కాంగ్రెస్‌కు వచ్చింది రూ.952 కోట్లు : ఏడీఆర్



న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల రూపేణ అన్ని రాజకీయ పార్టీలకు 2021-22లో సమకూరిన మొత్తం రూ.9,188 కోట్లని ప్రజాస్వామిక సంస్కరణల సమాఖ్య (ఏడీఆర్) వెల్లడించింది. ఇందులో 57శాతం బీజేపీ ఖాతాకు చేరినట్లు తెలిపింది. భారతీయ జనతా పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ.5,272 కోట్లు వచ్చాయని పేర్కొంది. కాంగ్రెస్ పార్టీకి రూ.952 కోట్లు రాగా మిగతాది మిగిలిన పార్టీలు పొందినట్లు వెల్లడించింది. ఏడు జాతీయ పార్టీలు, 24 ప్రాంతీయ పార్టీలకు మొత్తం రూ.9,188.35 కోట్లు కేవలం ఎన్నికల బాండ్ల ద్వారా సమకూరినట్లు ఏడీఆర్

- మిగతా 2 లో

రూ.538 కోట్ల జెట్ ఎయిర్‌వేస్ ఆస్తుల జప్తు

మనీలాండరింగ్ కేసులో ఈడీ చర్యలు

విదేశాల్లో ట్రస్టుల ద్వారా గోల్‌మాల్

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో జెట్ ఎయిర్‌వేస్ (ఇండియా) లిమిటెడ్‌కు చెందిన రూ.538 కోట్లు విలువచేసే స్థిర-చరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సీజ్ చేసింది. జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్, ఆయన భార్య అనితా, కుమారుడు నివాన్ గోయల్‌కు చెందిన లండన్, దుబాయ్ ఆస్తులతో పాటు భారత్‌లోని కొన్ని ఆస్తులను అధికారులు సీజ్ చేశారు. అలాగే జెట్ ఎయిర్‌వేస్ ప్రై.లి., జెట్ ఎంటర్‌ప్రైజెస్ ప్రై.లి. కంపెనీల పేర్ల మీద ఉన్న వాణిజ్య భవనాలు, 17 రెసిడెన్షియల్ ఫ్లాట్లు, బంగళాలను స్వాధీనం చేసుకున్నారు. మనీలాండరింగ్

- మిగతా 2 లో

పెరిగిన వాణిజ్య గ్యాస్ ధర

- 19 కిలోల సిలిండర్‌కు రూ.101.5 పెంపు
- 5.8 శాతం తగ్గిన విమాన ఇంధన ధర

న్యూఢిల్లీ : వాణిజ్య గ్యాస్ ధర అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 19 కిలోల సిలిండర్‌కు రూ.101.5 చొప్పున పెరిగింది. గృహావసరాల కోసం వినియోగించే 14.2 కిలోల సిలిండర్‌పై రూ.903 వద్ద ఎటువంటి మార్పు లేదు. అయితే, జులై నుంచి నాలుగు దఫాల నెలవారీ పెరుగుదల తర్వాత బుధవారం విమాన ఇంధనం లేదా ఏటీఎఫ్ ధర దాదాపు 5.8 శాతం తగ్గింది. నెలవారీ ధరల సవరణల్లో భాగంగా దేశీయ చమురు విక్రయ సంస్థలు హోటళ్లు, రెస్టారెంట్‌లు వంటి వేర్వేరు సముదాయాల్లో వినియోగించు వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను పెంచాయి. 19 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.101.5 కు పెరిగింది. అంతకుముందు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కలిపి దాదాపు రూ.250 మేర ధర తగ్గిన విషయం తెలిసిందే. నెలవారీగా ధరలు పెరగడం ఇది వరుసగా రెండోసారి. అక్టోబరు 1న 19 కిలోల సిలిండర్‌పై రూ.209 చొప్పున పెంచారు. తాజాగా మరో రూ.100 పెంచడంతో తగ్గింపుతో లభించిన ఉపశమనం ఆవిరైంది. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.1,833కు చేరింది. అంతకుముందు ఇది రూ.1,731గా ఉంది. చెన్నైలో రూ.1,999.50, కోల్‌కతాలో రూ.1,943, ముంబైలో

- మిగతా 2 లో

కేంద్రం నిర్ణయంతో

రాష్ట్రం ఎడారి

- కృష్ణా జలాల పునఃపంపిణీపై నోటిఫికేషన్ ఉపసంహరించాలి
- కర్నూలులోనే కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయం
- పంటనష్టపోయిన రైతుకు పరిహారమివ్వాలి
- సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణానదీ జలాల పునఃపంపిణీపై మోదీ సర్కారు ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని, కృష్ణానదీ యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని విశాఖపట్నంలో కాకుండా కర్నూలులో ఏర్పాటు చేయాలని, సమగ్ర సర్వే ద్వారా కరువు మండలాలను ప్రకటించాలని, నీరులేక ఎండిపోయి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, రబీలో పంటలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. 'కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్-ఏపీకి జరుగుతున్న అన్యాయం'పై సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో స్థానిక దాసరి భవన్‌లో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసం కృష్ణాజలాల పునఃపంపిణీ అంశాన్ని కేంద్రం తెరపైకి తీసుకొచ్చిందని విమర్శించారు. ఏపీ ప్రజలను, రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం జగన్‌ను బీజేపీ లెక్కచేయటం లేదని ఆగ్రహం వెలిబుచ్చారు. రాష్ట్రంలో 18 జిల్లాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నాయని, సాధారణంగా రాయలసీమ జిల్లాలకే పరిమితమయ్యే కరువు...ఈసారి ఆయకట్టు ప్రాంతాన్నీ వదలలేదన్నారు. తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు నిండుకున్నాయన్నారు. కృష్ణాడెల్టాలో నీరులేక దుర్భిక్షం ఏర్పడిందన్నారు. కర్నాటక ఎన్నికల సమయంలో ఎగువభద్రను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన మోదీ ప్రభుత్వం...ఆఘమేఘాలపై రూ.5300 కోట్లు కేటాయించిందని రామకృష్ణ విమర్శించారు. దీనివల్ల

- మిగతా 2 లో

నెలాఖరుకు గ్రూప్స్ నోటిఫికేషన్లు

- రెండింటిలో వెయ్యి పోస్టుల భర్తీ
- ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : నవంబరు నెలాఖరులోపు గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్‌లు ఇస్తామని ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ తెలిపారు. గ్రూప్-1లో 100, గ్రూప్-2లో 900 పోస్టులు భర్తీ చేస్తామని, గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫిబ్రవరిలో నిర్వహించాలనుకుంటున్నామని చెప్పారు. ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2022 గ్రూప్-1 ప్రక్రియను రికార్డు స్థాయిలో తొమ్మిది నెలల్లో పూర్తి చేశామని గుర్తు చేశారు. ఈ గ్రూప్-1 ప్రక్రియ కూడా తొమ్మిది నెలల్లో పూర్తి చేస్తామన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో రెండు పేపర్ల స్థానంలో ఒకే పేపర్ ఉంటుందని తెలిపారు. గ్రూప్-1 మెయిన్స్‌లో అయిదు పేపర్లకు బదులు నాలుగే ఉంటాయన్నారు. ఇందులో రెండు పేపర్లు ఆబ్జెక్టివ్ తరహాలో, రెండు పేపర్లు డిస్క్రిప్షన్ తరహాలో ఉంటాయని చెప్పారు. లాంగ్వేజ్‌లో రెండు పేపర్లకు బదులు ఒక పేపర్ మాత్రమే ఉంటుందన్నారు. సిలబస్‌లో ఎటువంటి మార్పులు ఉండవన్నారు. నిరుద్యోగ అభ్యర్థులకు మేలు చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. యూపీఎస్సీ, మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లలో పరీక్షలను పరిశీలించిన తర్వాతే మార్పులు చేశామన్నారు. డిసెంబరులో 2,200 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఏపీపీఎస్సీ అధ్వర్యంలోనే పరీక్షలు జరిపి జనవరిలో ఫలితాలు వెల్లడిస్తామని సవాంగ్ తెలిపారు.

హైదరాబాద్‌కు చంద్రబాబు

- రాజమండ్రి నుంచి తెల్లవారుఝామున ఉండవల్లికి...
- కుటుంబ సభ్యుల భావోద్వేగం
- హైదరాబాద్‌లో టీడీపీ శ్రేణులు, ఐటీ ఉద్యోగుల భారీ స్వాగతం
- నేడు ఏఐజీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వైద్య పరీక్షలు, కంటి ఆపరేషన్ నిమిత్తం బుధవారం సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం నుంచి హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా గన్నవరంలో ఘన వీడ్కోలు పలకగా, హైదరాబాద్‌లో టీడీపీ శ్రేణులు, ఐటీ ఉద్యోగులు శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం భారీ ర్యాలీతో జూబ్లీ హిల్స్ నివాసానికి వెళ్లారు. గురువారం ఏఐజీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు అనంతరం ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రిలో కంటికి శస్త్ర చికిత్స చేయించుకోనున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన దాదాపు 52 రోజుల పాటు రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబుకు మంగళవారం హైకోర్టు ఆరోగ్య కారణాల రీత్యా నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. బెయిల్ ఉత్తర్వులు వెలువడిన అనంతరం చంద్రబాబు మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు ఉండవల్లి వచ్చేందుకు రాజమహేంద్రవరంలో బయలుదేరగా

- మిగతా 2 లో

సీబీఎస్ఈ కష్టాలు

సిలబస్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ అవసరం

1000 పాఠశాలలకు బోర్డు గుర్తింపు

విద్యార్థుల అవస్థలు...పరీక్షల సన్నద్ధతపై అనుమానం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విద్యావ్యవస్థలో వివిధ సంస్కరణలు తీసుకొచ్చి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామని ఆర్భాటంగా చెబుతున్న జగన్ సర్కారుకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇప్పటికే సీబీఎస్ఈ, బైజూస్, ఐబీ, టోఫెల్ వంటి విధానాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వాటి అమలు తీరు గందరగోళంగా మారింది. ప్రధానంగా సీబీఎస్ఈ విధానానికి ఆదిలోని అవరోధాలు ఎదురవుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం (2023-24) నుంచి చాలా ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టి... ఆ దిశగా వార్షిక పరీక్షల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు 40 వేల వరకు ఉన్నాయి. ఇందులో వెయ్యి పాఠశాలలకు సీబీఎస్ఈ బోర్డు గుర్తింపునిచ్చింది. ఆ దిశగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధత చేయడంలో వెనుకబాటు కనిపిస్తోంది. కేవలం పాఠశాలలు సీబీఎస్ఈ గుర్తింపు పొంది...సిలబస్ అమలు చేయడం వల్ల సత్ఫలితాలు ఉండబోవని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల విద్యార్థులకు మేలు కంటే నష్టమే అధికంగా జరుగుతోందని వక్కాణిస్తున్నారు. సీబీఎస్ఈ విధానంలో ఎనిమిదో తరగతి నుంచి బేసిక్ విధానం ప్రారంభమై, పదో తరగతి వరకు కొనసాగుతుంది. ఆయా తరగతులకు అనుగుణంగా సబ్జెక్టులలో సిలబస్‌ను పెంచుకుంటూ పోతారు. సీబీఎస్ఈ సిలబస్ విధానం పూర్తిగా ఇంగ్లీష్ మీడియంలోనే ఉంటుంది. అంతకుముందు తెలుగు మాధ్యమంలో ఉన్న విద్యార్థులు కొందరు సీబీఎస్ఈ సిలబస్‌లోకి వస్తే ఇబ్బందులు ఎదురవుతాయి. సీబీఎస్ఈ బోర్డు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వారు కష్టపడాల్సి ఉంది. ఈ సమస్యలను ప్రభుత్వం గుర్తించి సీబీఎస్ఈ బోర్డు విధానంలో పరీక్షలకు విద్యార్థులను సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరముంది.

సీనియర్ ఉపాధ్యాయుల కరువు

ప్రైవేట్ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానంతో బోధిస్తున్న తీరు కాస్త

- మిగతా 2 లో

ఇదీ లోకం!

బాంబుల వర్షం

గాజా శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ భీకర దాడి : 50మంది మృతి

- 8,800కు పెరిగిన పలస్తీనా మృతులు
- ఏడుగురు బందీల మృతి: హమాస్
- మళ్లీ ఇంటర్నెట్, సమాచార సేవల స్తంభన

జెరూసలేం: గాజాపై ఇజ్రాయిల్ దళాలు భీకరంగా దాడులను సుమారు నెల రోజులుగా కొనసాగిస్తున్నాయి. అమెరికాలో తయారైన ఆరు బాంబుల (ఒక్కో బాంబు టన్ను బరువుంటుంది)తో గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై వైమానిక దాడి చేసింది. దీంతో 50 మంది పలస్తీనియన్లు మరణించగా 400 మందికి గాయాలయ్యాయి. గాజాలోని అధిక జనాభాగల ప్రాంతం జబలియా అని, కేవలం 1.4చదరపు కిలోమీటర్లలో 60వేల మంది

- మిగతా 2 లో

సంక్షేమంలో ఏపీ ముందంజ

- సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి వైఎస్సార్ విశేష కృషి
- వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానంలో గవర్నర్ నజీర్
- వీరంతా సామాన్యులుగా ఒదిగి ఉన్న అసామాన్యులు : సీఎం జగన్

2లో

గాజాలో బాలల మృతి

రోజుకు 420 మంది పలస్తీనా చిన్నారుల మృతి: యూనిసెఫ్

మానవాళి రక్షణకు హామీనివ్వాలి: ఐరాసకు రాయబారుల వినతి

జెనీవా: గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ మానవతా విపత్తునకు తెరతీసింది. ఇజ్రాయిల్ వైమానిక, భూతల దాడుల్లో నిత్యం వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రోజుకు కనీసం 420 మంది పిల్లలు చనిపోతున్నారు. దీంతో గాజా పిల్లల శ్మశానంగా మారిందని యూనిసెఫ్ ఆవేదన వ్యక్తం చేసింది. పలస్తీనా ప్రజలను ఇజ్రాయిల్ సామూహికంగా శిక్షిస్తోందని యూఎన్ రిలీఫ్, వర్క్స్ ఏజెన్సీ (యూఎన్ఆర్‌డబ్ల్యూఏ) కమిషనర్ జనరల్ ఫిలిప్ లజ్జారిని అన్నారు. అనుషంగిక నష్టం నుంచి పిల్లలు, మహిళల రక్షణకు హామీనివ్వాలని ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి అత్యవసర సమావేశంలో ప్రపంచ దేశాలను ఫిలిప్ కోరారు. గాజాలో కాల్పుల విరమణ కోసం ఒత్తిడి తేవాలని యూఏఈ, చైనాకు పిలుపునిచ్చారు. యూనిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్యాథరీన్ రస్సెల్ మాట్లాడుతూ 26 రోజులుగా జరుగుతున్న దాడుల్లో సుమారు 4వేల మంది పిల్లలు చనిపోగా పలస్తీనాలో మృతుల సంఖ్య 8,500కు చేరుకున్నది. 20వేల మందికి గాయాలయ్యాయి. ఈ లెక్కల రోజుకు 420 మందికిపైగా చిన్నారులు చనిపోతున్నారు. వందల మంది గాయపడుతున్నారు. ఇజ్రాయిల్ దాడుల్లో గాజాలోని బాల్యం ఛిద్రమవుతోందని క్యాథరీన్ ఆందోళన వ్యక్తం చేశారు. మృతుల్లో 70 శాతానికిపైగా పిల్లలు, మహిళలు ఉన్నట్లు ఫిలిప్ లజ్జారిని వెల్లడించారు. కనివిని ఎరుగని రీతిలో మానవతా విపత్తు మన కళ్ల ఎదుట సంభవిస్తోందని, ఇది భరించలేనిదని అన్నారు. తమ ఇళ్లు, వాకిళ్లు విడిచి వెళ్లిపోయేలా లక్షల మంది పలస్తీనా ప్రజలను ఇజ్రాయిల్ బలవంతపెడుతోందని, పర్యవసానంగా యూఎన్ఆర్‌డబ్ల్యూఏ శిబిరాలు కిక్కిరిసిపోయాయని అన్నారు. 6,70,000 మంది పలస్తీనా ప్రజలు నిరాశ్రులయ్యారని, శిబిరాలుగా మార్చబడిన స్కూళ్లలో తలదాచుకుంటున్నారని చెప్పారు. యూఎన్ఆర్‌డబ్ల్యూఏకు చెందిన 65 మంది సిబ్బంది అక్టోబరు 7 నుంచి గాజా స్ట్రిప్‌లో జరిగిన ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోయారని తెలిపారు. వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేంలో పరిస్థితులు రోజురోజుకూ క్షీణిస్తున్నట్లు ఫిలిప్ చెప్పారు. 34 ఆరోగ్య కేంద్రాలు, 21 ఆసుపత్రులపై ఇజ్రాయిల్ దాడులు జరిపిందని, 12 ఆసుపత్రులు దెబ్బతిన్నాయని క్యాథరీన్ రస్సెల్ తెలిపారు. ఇజ్రాయిల్ బాంబులకు 221 స్కూళ్లు, 1,77,000 ఇళ్లు ధ్వంసమైనట్లు వెల్లడించారు. తక్షణమే కాల్పులు, దాడులను విరమించాలని, పిల్లల భద్రతకు హామీనివ్వాలని పిలుపునిచ్చారు. 120 దేశాలు ఆమోదించిన ఐరాస సర్వసభ్య సమావేశ తీర్మానం గాజాలో దాడులు ఆపేయాలని డిమాండ్ చేస్తోందని ఐరాసకు చైనా రాయబారి జాంగ్ జున్ గుర్తుచేశారు. మొత్తం ప్రపంచం ఖండిస్తున్నాగానీ ఇజ్రాయిల్ తీరు మారడంలేదని రష్యా దౌత్యాధికారి వసీలీ నెబెన్‌జ్యా విమర్శించారు. అమెరికా మద్దతిస్తున్నందునే ఇజ్రాయిల్ విషయంలో భద్రతా మండలి కఠిన చర్యలు తీసుకోలేకపోతోందన్నారు. పలస్తీనా దౌత్యాధికారి మాట్లాడుతూ మానవాళిని రక్షించాలంటే గాజాలోని పలస్తీనియా ప్రజలను కాపాడాలని పిలుపునిచ్చారు. కాగా, నిషేధిత శ్వేత ఫాస్ఫరస్ ఆయుధాలతో రసాయన దాడులకు ఇజ్రాయిల్ పాల్పడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

ఇజ్రాయిల్‌ను బహిష్కరించాలి

ఆహారం, చమురు ఆపేయండి : ముస్లిం దేశాలకు ఇరాన్ పిలుపు

జెరూసలేం: గాజాలో ఇజ్రాయిల్ దురాక్రమణ రోజురోజుకూ తీవ్రమవుతోంది. హమాస్ శిబిరాలన్న నెపంతో ఆసుపత్రులు, శరణార్థి శిబిరాలు, నివాస ప్రాంతాల్లో బాంబు వర్షాన్ని కురిపిస్తూ బీభత్సం సృష్టిస్తోంది. మారణహోమాన్ని సృష్టిస్తోంది. దీంతో ఇజ్రాయిల్‌ను బహిష్కరించాలని, ఆహారం, చమురు ఎగుమతులు నిలిపివేయాలని ముస్లిం దేశాలకు ఇరాన్ పిలుపునిచ్చింది. గాజాపై బాంబు దాడులను నిలిపివేయాలన్న డిమాండ్‌తో ఆ దేశంపై ఒత్తిడిని పెంచేలా చర్యలు తీసుకోవాలని ఇరాన్ అధినేత అలీ హుస్సేనీ ఖమేని సూచించారు. 'గాజాపై తక్షణమే బాంబు దాడులు ఆగాలి. జియోనిస్ట్ ప్రభుత్వానికి చమురు, ఆహార ఎగుమతులు నిలిపివేయాలి' అని బుధవారం చేసిన ప్రసంగంలో ఖమేని ఉద్ఘాటించారు. గాజా ప్రజలు తమ సహనంతో ప్రజల మనస్సాక్షిని కదిలించారని ప్రపంచవ్యాప్తంగా పలస్తీనాకు అనుకూలంగా జరుగుతున్న ఆందోళనలను ఉద్దేశించి అన్నారు. 'ప్రపంచంలో ఏం జరుగుతోందో చూడండి. అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, బ్రిటన్ వంటి దేశాల్లో జనం వీధుల్లోకి వచ్చి ఇజ్రాయిల్, అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. ఆ దేశాలు తమ విశ్వసనీయతను, ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాయి. ఇజ్రాయిల్ దాడులను సమర్థించేందుకు ఆ దేశాల వద్ద ఏమీ లేదు. గాజా పరిస్థితిని మనం మరువరాదు. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలు గాజాపై దండయాత్ర, దురాక్రమణకు అణచివేతదారులకు అండగా నిలిచాయి' అని ఖమేని నొక్కిచెప్పారు. ఇప్పటివరకు గాజాపై ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో మృతుల సంఖ్య 8,800కు చేరుకున్నట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. పలస్తీనా ప్రజలపై దురాక్రమణను ఆపకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కొవాల్సి వస్తుందని ఇజ్రాయిల్‌కు ఇరాన్ పాలకులు ఇప్పటికే హెచ్చరికలు చేశారు. కదన రంగంలోకి దిగేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు సంకేతాలనూ టెహ్రాన్ ఇచ్చింది. ఇజ్రాయిల్ చేసే నేరాలకు ప్రతిఘటన సహజమేనని ఇరాన్ అగ్రదౌత్యాధికారి హుస్సేన్ అమిరాబ్దుల్లాహియన్ వెల్లడించారు. 'సలహాలు, సూచనల కోసం ప్రతిఘటన సంఘాలు ఆగబోవు. ఈ దండయాత్రను ఆపేందుకు రాజకీయంగా ఉన్న అవకాశాలను చివరి అస్త్రంగా వాడాల్సిందే లేకపోతే పరిస్థితి చేయి దాటిపోతుంది' అని ఆయనన్నారు.

ఇజ్రాయిల్‌తో దౌత్య బంధాన్ని తెంచేసిన బొలీవియా

పశ్చిమాసియాలో ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ఆ దేశంతో దౌత్య సంబంధాలు తెంచేసుకుంటున్నట్లు బొలీవియా ప్రకటించింది. కొలంబియా, చిలీ దేశాలు కూడా పశ్చిమాసియా దేశాల రాయబారాలను రికాల్ చేశాయి. గాజాపై ఇజ్రాయిల్ ఏకపక్ష దాడులను దక్షిణ అమెరికా దేశాలు తీవ్రస్థాయిలో ఖండించాయి. తక్షణమే దాడులు ఆపాలని డిమాండ్ చేశాయి. అంతర్జాతీయ చట్టాన్ని ఇజ్రాయిల్ అతిక్రమిస్తోందని ఆరోపించాయి. మానవతా కారిడార్ ఏర్పాటు చేయాలని బొలీవియా, చిలీ నొక్కిచెప్పాయి. గాజాపై దాడుల క్రమంలో ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలు తెంచేసుకున్న మొదటి దేశంగా బొలీవియా నిలిచింది.

పలస్తీనా ప్రజల ఊచకోతకు ఇజ్రాయిల్ పాల్పడుతోందని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో వ్యాఖ్యానించారు. గాజాపై దాడులను విరమించాలని లాటిన్ అమెరికా దేశాలైన మెక్సికో, బ్రెజిల్ కూడా పిలుపునిచ్చాయి. 'ఇజ్రాయిల్ ప్రధాని పిచ్చి పరాకాష్ఠకు చేరుకోవడాన్ని మనం చూస్తున్నాం. గాజా స్ట్రిప్‌ను తుడిచిపెట్టేయాలని ఆయన భావిస్తున్నారు' అని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా వ్యాఖ్యానించారు.

పెరిగిన వాణిజ్య గ్యాస్ ధర

(మొదటిపేజీ తరువాయి)

రూ.1,785.50కు చేరింది. కొత్త ధర బుధవారం నుంచే అమలులోకి వస్తుందని చమురు సంస్థలు వెల్లడించాయి. 14.2 కిలోల గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర మాత్రం మారలేదు. ఆగస్టు 30న వీటి ధర రూ.200 తగ్గిన విషయం తెలిసిందే. మరోవైపు, విమాన ఇంధన ధరల (ఏటీఎఫ్ ధర) ను చమురు విక్రయ సంస్థలు తగ్గించాయి. ఒక్కో కిలో లీటరుపై రూ.6,854.25కు కుదించింది. దీంతో దిల్లీలో కిలో లీటరు ఏటీఎఫ్ ధర రూ.1,11,344.92కు చేరుకుంది. విమానయాన సంస్థ నిర్వహణ వ్యయంలో 40 శాతంగా ఉండే జెట్ ఇంధన ధరలను బుధవారం తగ్గించడం వల్ల ఇప్పటికే ఆర్థికంగా కష్టాల్లో ఉన్న విమానయాన సంస్థలపై భారం తగ్గనుంది. మరోవైపు, పెట్రోల్, డీజిల్ ధరల్లో మాత్రం 19 నెలలుగా ఎటువంటి మార్పు లేదు. దేశ రాజధానిలో లీటర్ పెట్రోల్ ధర రూ.96.72 కాగా, డీజిల్ లీటరుకు రూ.89.62గా ఉంది. వంట గ్యాస్‌తో పాటు ఏటీఎఫ్ ధరలను ప్రభుత్వరంగ సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్‌లు ప్రతి నెలా సవరిస్తుంటాయి.

సీబీఎస్ఈ కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

మెరుగ్గానే ఉంటుంది. ఎంతోకాలం నుంచి సీబీఎస్ఈ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో అందుకు తగిన ఉపాధ్యాయులు, ల్యాబ్, లైబ్రరీ తదితర సదుపాయాలు ఉంటాయి. బోర్డు పరీక్షలకు అనేకమార్లు విద్యార్థులను తీర్చిదిద్దిన సీనియర్ ఉపాధ్యాయులు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉన్నారు. దాంతో అక్కడ సీబీఎస్ఈ విధానంలో సిలబస్ బోధించే ప్రక్రియ సులువుగా ఉంటుంది. అక్కడ విద్యార్థులు ప్రైమరీ నుంచి ఇంగ్లీష్ మీడియం చదవడం వల్ల విద్యార్థులు సీబీఎస్ఈ విధానానికి త్వరగా దగ్గరవుతున్నారు. అదే ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానం వల్ల తెలుగు మీడియం నుంచి ఇంగ్లీష్ మీడియంలోకి వచ్చేవాళ్లు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కరువయ్యాయి. ప్రధానంగా 9,10 తరగతుల వారికి బోర్డు సిలబస్‌తో నిర్వహించే పరీక్షలను వారు ఎదుర్కోవడం అసాధ్యంగా మారుతోంది. దీంతో పదో తరగతి బోర్డు పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పూర్తిగా తగ్గే ప్రమాదముంది.

స్టేట్ సిలబస్‌తో విద్యార్థుల ప్రతిభ

ఆంధ్రప్రదేశ్‌లో పది, ఇంటర్ తరగతులను స్టేట్ సిలబస్ ద్వారా చదివిన విద్యార్థులు ప్రతిష్ఠాత్మక ఐఐటీ, నీట్ విద్యా సంస్థల్లో సీట్లు పొందుతున్నారు. మొదట స్టేట్ బోర్డ్ సిలబస్ చదివి, ఆ తర్వాత సీబీఎస్ఈ విధానంలోకి వచ్చిన విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. సీబీఎస్ఈ గుర్తింపు పొందిన ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించాలి. ఆ సిలబస్‌కు అనుగుణంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలి. సిలబస్‌ను ఉపాధ్యాయులకు అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేకుంటే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సీబీఎస్ఈ విధానానికి అడ్డంకులు తప్పవు. అందువల్ల సీబీఎస్ఈ గుర్తింపు పొందిన పాఠశాలల ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి, వారిని సీబీఎస్ఈ విధానానికి అనుగుణంగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాంబుల వర్షం

(మొదటిపేజీ తరువాయి)

ఉంటారని ఖుద్దూస్ న్యూస్ నెట్వర్క్ పేర్కొంది. జబాలియా శిబిరంపై దాడిలో ఏడుగురు బందీలు మరణించినట్లు హమాస్ ప్రకటించింది. మృతుల్లో ముగ్గురు విదేశీయులు ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు హమాస్ సైనిక విభాగం ఓ ప్రకటన వెలువరించింది. తాజా దాడిలో హమాస్ కమాండర్ ఇబ్రహీమ్ బియారీ చనిపోయినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. అక్టోబరు 7వ తేదీ దాడిలో ఇతను కీలక పాత్ర పోషించినట్లు పేర్కొంది. అయితే ఈ వార్తలను హమాస్ తోసిపుచ్చింది. శిబిరంలో తమ నేతలెవరూ లేరని తెలిపింది. కాగా, తమ సైనికులు మరో తొమ్మిది మంది చనిపోగా ఇప్పటివరకు మరణించిన సైనికుల సంఖ్య 326కు చేరినట్టు ఐడీఎఫ్ వెల్లడించింది. శరణార్థ శిబిరంపై ఇజ్రాయిల్ దాడిని ఈజిప్టు తీవ్రంగా ఖండించింది. ఇది అమానవీయ చర్య అని వ్యాఖ్యానించింది. గాయపడిన పలస్తీనియన్లను చికిత్స కోసం రఫా సరిహద్దును తెరవనున్నట్టు తెలిపింది. గాజాలో ఇంటర్నెట్, సమాచార సేవలను నిలిపివేస్తున్నట్టు పలస్తీనా టెలికమ్యూనికేషన్ కంపెనీ (పాల్‌టెల్) బుధవారం ప్రకటించింది.

అల్‌జజీరా జర్నలిస్టు కుటుంబంలో 19 మంది మృతి

శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ కురిపించిన బాంబులకు అల్‌జజీరాకు చెందిన ఓ జర్నలిస్టు తన కుటుంబంలో 19 మందిని కోల్పోయారు. గాజా బ్యూరోలో బ్రాడ్‌కాస్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ అబు అల్ ఖుమ్‌సన్ తన కుటుంబాన్ని కోల్పోయారని అల్‌జజీరా వార్తా సంస్థ తెలిపింది. మహమ్మద్ తండ్రి, సోదరుడు, ఇద్దరు తోబుట్టువులు, ఎనిమిది మంది మేనళ్లులు, మేనకోడళ్లు, ఇతర కుటుంబసభ్యులు చనిపోయినట్లు పేర్కొంది.

తెరుచుకున్న రఫా - విదేశీయులకు తొలి ప్రాధాన్యత

ఇజ్రాయిల్ భీకర దాడుల్లో 20వేల మందికిపైగా పలస్తీనియన్లు గాయపడ్డారు. అయితే మెరుగైన వైద్య చికిత్స కొందరు కొందరిని తరలించేందుకుగాను రఫా సరిహద్దును తెరవనున్నట్లు ఈజిప్టు ప్రకటించింది. అయితే విదేశీయులకు తొలి ప్రాధాన్యత ఇచ్చింది. గాజాకు మానవతాసాయం కోసం రఫా సరిహద్దులను ఈజిప్టు అక్టోబరు 21న తెరిచింది. ఇప్పటి వరకూ వాహనాలను మాత్రమే అనుమతించింది కానీ మొదటిసారి పౌరుల తరలింపునకు అనుమతి ఇచ్చింది. విదేశీయులు, ద్వంద్వ పౌరసత్వం కలిగిన 400 మందితో పాటు తీవ్రంగా గాయపడిన 90 మంది బుధవారం రఫా సరిహద్దుల గుండా గాజా నుంచి తరలివెళ్లారని తెలిసింది. ఈజిప్టు, ఇజ్రాయిల్, హమాస్ మధ్య ఖతార్ మధ్యవర్తిత్వం, అమెరికా సమన్వయంతో ఒప్పందం ప్రకారం గాజా నుంచి తరలింపుల కోసం రఫా సరిహద్దు తెరుచుకున్నట్లు రాయిటర్స్ వెల్లడించింది. అలాగే సినాయిలో ఓ ఫీల్డ్ హాస్పిటల్‌ను ఈజిప్టు ఏర్పాటు చేసింది. పది అంబులెన్సులను రఫా సరిహద్దుకు పంపింది.

త్వరలో 200 మంది బందీలను విడుదల చేస్తాం: హమాస్

త్వరలోనే 200 మంది బందీలు లేక విదేశీ బందీలను విడుదల చేస్తామని మధ్య వర్తులతో హమాస్ చెప్పినట్లు అల్ ఖసమ్ బ్రిగేడ్స్ అధికారిక ప్రతినిధి అబు ఉబేదా వెల్లడించారు. అయితే బందీల గురించి ఎలాంటి వివరాలను తెలిపారు.

అణువణువు గాలిస్తున్న ఇజ్రాయిల్

దాడులు జరిపిన ప్రాంతాల్లో ఐడీఎఫ్ అణువణువు జల్లెడ పడుతోంది. సొరంగాల్లో దాగిన హమాస్ ఫైటర్ల కోసం గాలింపులు కొనసాగిస్తోంది. ప్రతి ఇంటిని తనిఖీ చేస్తోంది. గాజా ఉత్తర-దక్షిణ రహదారి లక్ష్యంగా చేసుకుని రెండువైపుల నుంచి ఇజ్రాయిల్ సైన్యం భీకర దాడులు చేసిందని స్థానికులు తెలిపారు.

అమెరికా అండతోనే

ఇజ్రాయిల్‌కు ఏటా నాలుగు బిలియన్ డాలర్ల వరకు ఆర్థిక సాయాన్ని అమెరికా అందజేస్తోంది. గాజాలో మారణహోమం సృష్టించేందుకు 14.3 బిలియన్ డాలర్ల అత్యవసర నిధిని ఇజ్రాయిల్‌కు అందజేసే సన్నాహాలు జరుగుతున్నాయి. పశ్చిమాసియాలోని పశ్చిమ సైనిక ఔట్‌పోస్టు ఉండటం వల్లనే ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతిస్తోందని అగ్రరాజ్యానికి చెందిన కార్యకర్తలు చెబుతున్నారు.

సంక్షేమంలో ఏపీ ముందంజ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సంక్షేమ పథకాలతో పాటు కొన్ని సూచికలలో ఏపీ అగ్రగామిగా ఉందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కొనియాడారు. విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానం బుధవారం కనులపండువగా సాగింది. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు సీఎం జగన్ మోహన్ రెడ్డి, ఆయన తల్లి విజయమ్మ పాల్గొన్నారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన 23 మందికి వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్, నలుగురికి వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులను గవర్నర్ అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తొలుత ఏపీ ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. 76 రెవెన్యూ డివిజన్‌లు, 108కి పైగా పోలీస్ సబ్ డివిజన్‌ల ఏర్పాటుతో రాష్ట్రంలో పాలన సులభతరం చేశారని కితాబునిచ్చారు. సాగునీటి రంగంలో, వ్యవసాయంలో, వైద్య రంగంలో 108 లాంటి సేవలు అందించిన వైఎస్ఆర్ ప్రజలకు ఎప్పుడూ గుర్తు ఉంటారన్నారు. ఏపీలో మొదలుపెట్టిన 108 సేవలు దేశ వ్యాప్తంగా విస్తరణ కావడంలో వైఎస్సార్ కృషి ఉందన్నారు. సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి ఆయన పాటుపడ్డారని, ఆ సేవలకు గుర్తింపుగా ఆయన పేరిట ఈ అచీవ్‌మెంట్ అవార్డులు ఇవ్వటం సంతోషదాయకమన్నారు. ఏపీ ప్రజలు మరింత అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నట్లు గవర్నర్ నజీర్ ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రాన్ని వివిధ రంగాల్లో దశాబ్దాలుగా సుసంపన్నం చేసిన మహనీయులను గౌరవిస్తూ వైఎస్సార్ అవార్డులతో సత్కరించే ఈ సంప్రదాయం మూడు సంవత్సరాలుగా చేస్తున్నామని తెలిపారు. మన సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తూ వివిధ రంగాల్లో ఆకాశమంత ఎదిగినా సామాన్యులుగానే ఒదిగి ఉన్న అసామాన్యులకు ఇస్తున్న అవార్డులు ఇవి అన్నారు. తెలుగుతనానికి, తెలుగు మాటకు, తెలుగు వాడి గుండె ధైర్యానికి మన పల్లెలు, మన పేదలు, మన రైతుల మీద మమకారానికి, మన సంస్కృతీసంప్రదాయాలకు నిలువెత్తు రూపం డాక్టర్ వైఎస్సార్ అన్నారు. ఆయన పేరిట ఏటా రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత అవార్డులు ప్రదానం చేస్తోందని తెలిపారు. వైఎస్సార్ హయాంలో వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా అంతకు ముందున్న చరిత్ర గతిని మారుస్తూ ఎన్నో ముందడుగులు పడిన పరిస్థితులు మనమంతా చూశామన్నారు. ఇలాంటి రంగాల్లోనే మన వ్యవసాయానికి, చేనేతకు, తప్పెటగుళ్లకు, జానపదానికి, రంగస్థలానికి, అభ్యుదయ, హేతు వాదానికి, సాటి మనుషులకు చేస్తున్న సేవలకు ఇలా అనేక రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న గొప్ప వ్యక్తులకు ఈ ఏడాది అవార్డుల్లో చోటు దక్కిందన్నారు. ఈ అవార్డులు అందుకుంటున్న వారంతా మన జాతి సంపద అంటూ వారందరికీ హృదయపూర్వకంగా సీఎం అభినందనలు తెలియజేస్తూ ప్రసంగం ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లలో 57శాతం బీజేపీకే

(మొదటిపేజీ తరువాయి)

తేల్చింది. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడం కోసం ఎన్నికల బాండ్ల చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు సుప్రీంకోర్టు విచారణలో ఉన్న విషయం విదితమే. 2017-18, 2021-22లో ఎన్నికల బాండ్ల ద్వారా జాతీయ పార్టీలకు వచ్చే విరాళాల్లో 743 శాతం పెంపుదల ఉన్నట్లు ఏడీఆర్ తెలిపింది. అలాగే కార్పొరేట్ల విరాళాలు 48శాతం మేర పెరిగాయని పేర్కొంది. 2017లో ఎలక్టోరల్ బాండ్ల స్కీమును ప్రవేశపెట్టిన కేంద్రం 2018 నుంచి దీనిని అమలు చేసింది. బాండ్ల రూపేణ విరాళాలిచ్చే దాతలు తమ పేర్లను బహిర్గతం చేయాల్సిన అవసరం ఉండదు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రూ.వెయ్యి, రూ.10వేలు, రూ.లక్ష, రూ.10లక్షలు, రూ.కోటి విలువ చేసే బాండ్లు జారీచేస్తుంది. ఈ ఏడాది జులైలో ఇచ్చిన నివేదికలో 2016-17, 2021-22లో రాజకీయ పార్టీలకు సగానికిపైగా విరాళాలు ఎలక్టోరల్ బాండ్ల రూపేణ వస్తున్నట్లు ఏడీఆర్ వెల్లడించింది. జాతీయ పార్టీలన్నింటికి కలిపి వచ్చే దానిలో సగానికిపైగా బీజేపీకి ఖాతాకు చేరుతున్నట్లు తెలిపింది.

రూ.538 కోట్ల జెట్ ఎయిర్‌వేస్ ఆస్తుల జప్తు

(మొదటిపేజీ తరువాయి)

నివారణ చట్టం-2002 కింద మొత్తం రూ.538 కోట్లు విలువ చేసే ఆస్తులను దర్యాప్తు సంస్థ సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. కెనరా బ్యాంకు వేసిన కేసులో గోయల్ సహా ఆరుగురిపై చార్జిషీటును ఈడీ మంగళవారం దాఖలు చేసింది. ఇచ్చిన రుణం మొత్తం రూ.848 కోట్లలో నుంచి రూ.538 కోట్లను జెట్ ఎయిర్‌వేస్ ఎగవేసినట్లు బ్యాంకు ఆరోపించింది. పీఎంఎల్ఏ కట్టం కింద గోయల్‌ను సెప్టెంబరు 1న ఈడీ అధికారులు అరెస్టు చేశారు. ఆయనను ముంబైలోని ఆర్థర్ రోడ్డు జైలులో ఉంచారు. విదేశాల్లో ట్రస్టులు పెట్టి డబ్బును గోయల్ కాజేసినట్లు ఈడీ ఆరోపించింది. స్థిరాస్తులు కొనేందుకు, ఫర్నీచర్, వస్త్రాలు, ఆభరణాల కొనుగోలునకు రుణమొత్తాన్ని వాడినట్లు ఆడిట్ రిపోర్టు ద్వారా వెల్లడైందని తెలిపింది. సెప్టెంబరు 12న కోర్టులో గోయల్ తరపున న్యాయమూర్తులు అబ్బాద్ పాండా, అమృత్ దేశాయ్, అమిత్‌నాయక్ వాదనలు వినిపిస్తూ తమ క్లయింట్ తన లేక తన కుటుంబం పేరుతో రుణాలు తీసుకోలేదని, దేనికీ హామీ ఇవ్వలేదన్నారు. 2011కు ముందు జెట్ ఎయిర్‌వేస్ తీసుకున్న రుణాల్లో చాలా వరకు సహారా ఎయిర్‌లైన్స్ కొనుగోలునకు వాడినట్లు తెలిపారు. జెట్ ఎయిర్‌వేస్ ఒక్కటే కాదు చాలా విమానయాన సంస్థలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు న్యాయవాది వెల్లడించారు. దేశంలో మాంద్యం కారణంగా కొన్ని చెల్లింపులను గోయల్ ఎగొట్టినట్లు తెలిపారు. గోయల్ తనకున్న అన్ని బ్యాంకు ఖాతాలు, దేశ-విదేశాల్లోని స్థిర, చరాస్తుల వివరాలను ఇవ్వలేదని న్యాయస్థానం పేర్కొంది.

కేంద్రం నిర్ణయంతో రాష్ట్రం ఎడారి

(మొదటిపేజీ తరువాయి)

రాయలసీమకు సంబంధించి హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ ద్వారా సిద్ధించే ప్రయోజనాన్ని వైసీపీ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని విమర్శించారు. ఇంత చేసినా కర్నాటకలో బీజేపీ ఓడిపోయిందని, తెలంగాణలోనూ ఓటమి తప్పదని స్పష్టంచేశారు. రాష్ట్రంలో 400లకు పైగా కరువు మండలాలు ఉంటే కేవలం 103 మండలాలను కరువు మండలాలుగా పేర్కొనటం అన్యాయమని రామకృష్ణ ఆరోపించారు. కృష్ణా జలాల పంపిణీ, కరువు పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగడుతూ ఈ నెల 14, 15 తేదీలలో విజయవాడలో 30 గంటల పాటు నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ దీక్షల్లో పాల్గొని సంఘీభావం ప్రకటించాలని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలను కోరారు.

సీపీఎం కేంద్ర కమిటీ నాయకులు పి.మధు మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంపకాలు జరిగాయని, ఏపీలో ఎవరూ అడక్కపోయినా తెలంగాణ కోరిందని ఏకపక్షంగా బీజేపీ నిర్ణయం తీసుకుని నోటిఫికేషన్ ఇవ్వటం దుర్మార్గమని విమర్శించారు. కృష్ణా జలాలపై చర్చించటానికి ఒక రోజు శాసనసభ అత్యవసర సమావేశం నిర్వహించాలని, కేంద్రం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని తీర్మానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నీటి నిర్వహణా పద్ధతులపై అవగాహన లేక రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు ఉండగా సలహాదారులను ఎందుకు పెట్టుకుంటున్నారని వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. పొలాలకు నీళ్లు లేక డ్రైనేజీ నీటిని మళ్లిస్తున్న దారుణమైన సంఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులకు నీరు రాకపోతే నదుల్లో ఉండే మట్టిని, ఇసుకను అమ్ముకోవాలని జగన్ ప్రభుత్వం భావిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు ఖండిస్తూ ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయటం లేదని, నీటి పంపకాల విషయంలో అన్యాయం చేస్తోందని, ఈ అంశాలపై కేంద్రాన్ని నిలదీయడం, ప్రజలకు వివరించడానికి ముఖ్యమంత్రి సహా వైసీపీ నేతలు భయపడుతున్నారన్నారు. కృష్ణానది నీటితో ఎలాంటి సంబంధంలేని, ఆయకట్టుగానీ, పరివాహక ప్రాంతంగానీ లేని విశాఖలో కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని పెట్టడం రాష్ట్రానికి, రాయలసీమకు చేస్తున్న మరో అన్యాయమన్నారు. ఈ ప్రతిపాదనను విరమించి కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కృష్ణానదీ జలాల పంపకంపై పార్లమెంట్‌లో చేసిన చట్టాన్ని ఒక్క సంతకంతో మోదీ కేబినెట్ మార్చేసిందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి విమర్శించారు. కేంద్రానికి మోకరిల్లుతున్న ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలు నిలదీయాలని కోరారు. రాయలసీమలో నీరులేని పరిస్థితి, నీరు ఉన్నా వాడుకోలేని దుర్గతి ఉందన్నారు. శ్రీశైలంలోని మిగులు జలాలు ఏపీకి ఇవ్వాలని చెబుతూనే...వాటిని కర్నాటక, తెలంగాణకు పంచేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో జిల్లాల మధ్య గొడవలు సృష్టించే కుట్ర జరుగుతోందన్నారు. కృష్ణాడెల్టా రైతాంగం రాయలసీమకు అండగా ఉండాలని కోరారు. ఎక్కడ ఎన్నికలు వస్తే అక్కడ రాజకీయ లబ్ధి కోసం బీజేపీ సాగిస్తున్న ఎత్తుగడలు సాగవని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. రాష్ట్రంలో నీటి ప్రాజెక్టుల కోసం వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు చేయలేదన్నారు. రెండున్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే గుండ్లకమ్మ ప్రాజెక్టుకు విరిగిపోయిన గేటు ఏర్పాటు చేయవచ్చన్నారు. కృష్ణాజలాలను పూర్తిగా వినియోగించుకుంటే పంజాబ్, హరియాణాలతో తలసరి ఆదాయంలో పోటీపడే వాళ్లమని చెప్పారు.

రాజ్యాంగ విరుద్ధంగా గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన కేంద్రంపై సుప్రీంకోర్టులో న్యాయపరంగా పోరాడదామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు సూచించారు. దాంతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడి, రైల్‌రోకో వంటి ఉద్యమ కార్యాచరణతో ప్రజాక్షేత్రంలో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ కరువు ప్రాంత ప్రజలకు ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయని బీజేపీ...విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరిస్తున్నదని మండిపడ్డారు. ఇప్పుడు రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా మార్చేందుకు కుట్ర చేస్తున్నదని విమర్శించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రామకృష్ణ మాట్లాడుతూ రాయలసీమకు మిగులు జలాలు కాకుండా నికర జలాలు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోసాల రవికాంత్ మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి పెరిగినా... గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. నవతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం, కృష్ణాడెల్టా పరిరక్షణ సమితి నాయకులు కొలనుకొండ శివాజీ మాట్లాడారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ... కృష్ణానది జలాల పున:పంపిణీ కోసం కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని తీర్మానం ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య రాష్ట్రంలో కరువు మండలాలపై సమగ్ర సర్వే జరిపించి 440 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, రబీ పంటలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ రెండు తీర్మానాలను రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అతిథులకు స్వాగతం పలికి సమావేశ అజెండాను వివరించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ వందన సమర్పణ చేశారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్ విప్లవ గీతాన్ని ఆలపించారు. సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి టి.తాతయ్య, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, రైతుసంఘాలు, సాగునీటి సంఘాల నేతలు హాజరయ్యారు.

హైదరాబాద్‌కు చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

దారి పొడవునా టీడీపీ శ్రేణులు భారీ సంఖ్యలో ఘనస్వాగతం పలకడంతో ఆయన ఉండవల్లి చేరుకోవడానికి 13 గంటల సమయం పట్టింది. బుధవారం ఉదయం తెల్లవారుఝామున 5 గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఆ సమయంలో కూడా అమరావతి రైతులు కరకట్ట నుంచి ఇంటి వరకు దారి మార్గం పొడవునా పూలు పరిచి ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు ఇంటికి చేరుకున్న సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కేసులో అక్రమంగా ఇరికించారంటూ చంద్రబాబును కుటుంబ సభ్యులు ఆలింగనం చేసుకుని కన్నీరు పెట్టుకున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు కూడా ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. వారికి ఆయన ధైర్యం చెప్పారు. అంతా మంచే జరుగుతుందని, ధైర్యంగా ఉండాలని సూచించారు. తొలుత ఇంటికి చేరుకున్న అనంతరం సతీమణి భువనేశ్వరితో కలిసి చంద్రబాబు పూజలు నిర్వహించారు.

ఇంజినీరింగ్ మూడోవిడత
కౌన్సెలింగ్ చేపట్టాలి

ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-మంగళగిరి: ఏపీ ఇంజినీరింగ్ సెట్ తృతీయ కౌన్సెలింగ్ నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ నాయకులు విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో ఏపీఈసెట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో కలిసి బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉన్న ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలియజేశారు. అనంతరం ఉన్నత విద్యాశాఖ మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి మందగళ్ల సాయికుమార్, ఉపాధ్యక్షులు బందెల నాసర్ జీ మాట్లాడుతూ విద్యారంగాన్ని గాలికి వదిలేసి అధికారం కోసం పాకులాడుతూ విద్యా శాఖామంత్రి బస్సు యాత్రలో ఉన్నారని విమర్శించారు. విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య, మెరుగైన వసతి, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉపాధి కల్పిస్తే విద్యార్థులే స్వచ్ఛందంగా ఓట్లు వేసి గెలిపిస్తారని... ఇలా బస్సు యాత్రలు, పాదయాత్రలు చేస్తే ఏ విద్యార్థి మిమ్మల్ని నమ్మి ఓట్లేసే పరిస్థితి రాష్ట్రంలో లేదని స్పష్టం చేశారు. ఏటా ఇంజినీరింగ్ సెట్ మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించే ఉన్నత విద్యామండలి... ఈ ఏడాది రెండు విడతలతోనే సరిపెట్టిందని, మూడో విడత ఉంటుందని చాలా మంది విద్యార్థులు రెండో విడతలో సీట్లు వచ్చినా చేరలేదని... మరికొందరు కోర్సులు, కళాశాలలు మార్చుకోవచ్చని ఎదురుచూస్తున్నారని తెలిపారు. విద్యార్థుల నుంచి వినతులు రావడంతో మొదట్లో మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహణపై పరిశీలిస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించినప్పటికీ ఇంతవరకు దీనిపై ఉన్నత విద్యామండలి స్పష్టత ఇవ్వలేదన్నారు. దీంతో విద్యార్థులు ఆందోళనలో ఉన్నారని, కన్వీనర్ కోటాలో చేరేవారిలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేదవారే ఉంటారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కన్వీనర్ కోటాలో చేరేవారికి ప్రభుత్వమే బోధన రుసుములు చెల్లిస్తుందని, స్పాట్, యాజమాన్య కోటాల్లో చేరితే విద్యార్థులే ఫీజుల భారం భరించాలని, మూడో విడతపై స్పష్టత లేకపోవడంతో చాలామంది స్పాట్, యాజమాన్య కోటాలో చేరాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను మూడోవిడత కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలకు సిద్ధమౌతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బేవర సుధీర్, ఎస్.రంజిత్, కె.సాయి, వై.కుమార్, పి.సురేష్, మత్తె అభిషేక్, యార్లగడ్డ శివ గోపి, హనోక్ బాబు, ఏపీఈసెట్ క్వాలిఫైడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పది పరీక్షకు అధిక ఫీజుపై
చర్యలు తీసుకోవాలి
శివారెడ్డి డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, పదవ తరగతి పరీక్షలకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు 125 రూపాయలైతే జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యులు ఒక విద్యార్థితో రూ.500 నుంచి రూ.600 చొప్పున వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభం మొదటిలోనే విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్కూల్, టెక్నో, సి బ్యాచ్ ఐకాన్, కోస్పార్క్ లాంటి కోర్సులను ఏర్పాటు చేసుకుని లక్షల రూపాయలు దోపిడీ చేశారని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు పరీక్ష ఫీజులోనూ ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే మూడు రెట్లు ఎక్కువగా వసూలు చేయడాన్ని తప్పుపట్టారు. తక్షణమే ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కంటే మూడు రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకుని, వాటిని సీజ్ చేయాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని శివారెడ్డి హెచ్చరించారు.

ఏపీ రాష్ట్ర అవతరణ వేడుకల్లో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి సీఎం నివాళులర్పించారు. ఆంధ్ర ప్రదేశ్ భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జునరావు రచించిన స్వాతంత్రోద్యమంలో ఆంధ్రులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలకు సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషాశ్రీచరణ్, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి, సాంస్కృతిక పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రిషికొండపై భవనాలు పర్యాటకులకే
కేంద్రానికి విశ్రాంత ఐఏఎస్ శర్మ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రిషికొండపై నిర్మించే భవనాలను పర్యాకుటలకే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ కార్యదర్శి లీలానందకు శర్మ బుధవారం లేఖ రాశారు. రిషికొండపై నిర్మాణాలకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాల కాపీని సైతం లీలానందకు శర్మ పంపించారు. రిషికొండ నిర్మాణాలపై గతంలోనే ఈ మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు. తీరప్రాంత నియంత్రణ జోన్ పరిధిలో ఏపీటీడీసీ ఉల్లంఘనలకు పాల్పడినట్లు స్పష్టమైందని తెలిపారు. భవనాలు పర్యాటకులకు కాకుండా సీఎం కార్యాలయ ఏర్పాటుకేనని స్పష్టమైందన్నారు. పర్యాటకుల కోసం కాకుండా ఇతర ప్రయోజనాల కోసం ఆ భవనాలు ఉపయోగించరాదని డిమాండ్ చేశారు. కేరళలోని కొచ్చిలో మరడు ఫ్లాట్ల విషయంలోనూ భవనాల కూల్చివేతకు సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. మరడు ఫ్లాట్ల యజమానులకు ఒక నియమం, ఏపీటీడీసీకి మరో నియమమా అని శర్మ ప్రశ్నించారు.

తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలి
ఏపీ రైతుసంఘం అధ్యక్షులు రామచంద్రయ్య

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పీ రామచంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీఆర్ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి బీ గిడ్డయ్య, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కే జగన్నాధం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ఎన్ రసూల్, ఎస్ మునెప్ప, నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సీపీఐ, ఏపీ రైతుసంఘం అధ్వర్యంలో దశల వారిగా చేసిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం ఎట్టాకేలకు రాష్ట్రవ్యాప్తంగా 103 కరువు మండలాలను ప్రకటించిందన్నారు. కర్నూలు జిల్లాలో 28, నంద్యాల జిల్లాలో 5 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిందన్నారు. ఈఏడాది కృష్ణాడెల్టాలో కూడా నీరు అందక వరి చేలు ఎండిపోయాయన్నారు. ఈ ఏడాది తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని ఖరీఫ్‌తోపాటు రబీలో కూడా పంటలు పండే అవకాశాలు లేవన్నారు. కేవలం పంటలే కాకుండా పశువులకు గ్రాసంతోపాటు వేసవి కాలంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉన్నాయన్నారు. తుగ్గలి, కర్నూలురూరల్, నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకోకుండా తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలని, పంటలు వేయడానికి తీసుకున్న రుణాలు రద్దుచేయాలని, రైతులకు రబీలో 90శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీచేయాలని, రైతులకు కరువు పెన్షన్ మంజూరు చేయాలని, పశుగ్రాసం సరఫరాచేయాలని రామచంద్రయ్య డిమాండ్ చేశారు.

కరువు మండలాలపై నిర్లక్ష్యం
ప్రభుత్వంపై శ్రీనివాసరావు మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో దాదాపు 300 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుంటే... కేవలం 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్రంగా తప్పుబట్టారు. 300 మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించాలని బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కరువుకు గురైన అన్ని మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించి...సహాయక చర్యలు చేపట్టాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. కేంద్రం కరువు బృందాలను పంపాలని, ప్రకృతి వైపరీత్యాల నిధిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ సొంత జిల్లా కడప జిల్లాలో 17 మండలాలలో కరువు పరిస్థితులు ఉంటే ఒక్క మండలాన్ని కూడా ప్రకటించలేదని, ప్రకాశం జిల్లాలో 38 మండలాలకుగాను 30 మండలాలు తీవ్రమైన కరువు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. బాపట్ల జిల్లాలో అద్దంకి, కొరిశపాడు, బల్లికురువ, సంతమాగులూరు, పంగులూరు, మార్టూరు వంటి ఆరు మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, అయినా వాటిని కరువు మండలాల జాబితాలో చేర్చలేదని విమర్శించారు.

చంద్రబాబుకు బెయిల్‌పై హర్షం

టీడీపీ అధినేత చంద్రబాబు మధ్యంతర బెయిల్‌పై విడుదల కావడం పట్ల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బెయిల్ సమయంలో ఆంక్షలు విధించటం దురదృష్టకరమని, చంద్రబాబు విషయంలో సీఐడీ కక్షసాధింపు వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడి విజయం సాధించిందని, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు.

రాష్ట్ర ప్రభుత్వ స్కాములపై సీబీఐ విచారణ

- సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య డిమాండ్
- కరువు జిల్లాల్లో నేటి నుంచి సీపీఐ బృందాల పర్యటన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వేల కోట్ల అవినీతికి పాల్పడిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చెబుతున్నారని... వాటన్నిటిపై సీబీఐ చేత విచారణ చేయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. బుధవారం విజయనగరంలోని అమర్ భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో లిక్కర్, మైనింగ్, ఇసుక వంటి వాటిపై సుమారు రూ.36 వేల కోట్ల మేర స్కాములు జరిగాయని, ఆధారాలున్నాయని పురందేశ్వరి సహా బీజేపీ నాయకులు చెబుతున్నారని... మరి ఇంత అవినీతి జరిగితే కేంద్రంలో ఉన్న వారి ప్రభుత్వం సీబీఐ చేత విచారణ ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. బీజేపీ-వైసీపీ మధ్య ఉన్న అనుబంధం ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కరువుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ సీఎం జగన్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటని ఈశ్వరయ్య అన్నారు. తప్పుడు లెక్కలతో రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. అధికార యంత్రాంగం నేరుగా రైతులు వద్దకు వెళ్లి చూస్తే కరువు పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా లక్ష ఎకరాలు వరి పంట దెబ్బతిందని చెప్పారు. రానున్న కాలంలో ఇప్పటికే పెరిగిన బియ్యం ధరలు రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యల్ని గాలికొదిలేశారన్నారు. ఈనెల 2వ తేదీ నుండి 18 వరకు కరువు జిల్లాలలో సీపీఐ అధ్వర్యంలో 18 బృందాలు పర్యటించనున్నట్లు చెప్పారు. కరువుతో అల్లాడుతున్న రైతులకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. జిల్లా అభివృద్ధి పేరుతో మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి వేల కోట్ల నిధులు దుర్వినియోగం చేశారని ఈశ్వరయ్య ఆరోపించారు. జిల్లాకు పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించినప్పుడు మాత్రమే అభివృద్ధి అన్నది జరుగుతుందన్నారు. ఈత చెట్లు, తాటి చెట్లు నాటడం వల్ల ప్రజలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ, సహాయ కార్యదర్శి బుగత అశోక్ కార్యవర్గ సభ్యులు ఎస్ రంగరాజు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పాత విద్యార్హతలపైనే పదోన్నతులు

- ఆర్టీసీ ఎండీ హామీ
- ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీఎస్ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనానికి ముందు (31-12-19 లోగా) సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ అప్పటి భర్తీ ప్రక్రియ ప్రకారం పాత విద్యార్హతలతోనే పదోన్నతులు ఇచ్చేందుకు ఆర్టీసీ ఎండీ అంగీకరించినట్లు ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు అధ్వర్యంలో జరిగిన 92 రోజుల ఉద్యమంలో పెట్టిన డిమాండ్ మేరకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. అందులో భాగంగా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును ఇటీవల తాము కలిసిన సమయంలోనూ పాత పద్ధతిలోనే ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వానికి లేఖ రాసినట్లు, అందుకు ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అనంతరం ఉత్పన్నమైన అనేకమైన న్యాయపరమైన చిక్కుల వల్ల 17 నెలలుగా నిలిచిన ఆర్టీసీ ఉద్యోగుల అన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని, వాటి అమలు కోసం ఇప్పటికే కిందిస్థాయి అధికారులకు ఆర్టీసీ యాజమాన్యం ఆదేశించిందని వివరించారు. కావలి సంఘటనలో డ్రైవర్‌పై దాడి చేసిన దుండగులందరినీ అరెస్టు చేసేలా తమ వంతుగా డీజీపీని కలసి మాట్లాడతానని ఆర్టీసీ ఎండీ భరోసా ఇచ్చారని యూనియన్ నేతలు పేర్కొన్నారు.

ఒకటో తేదీనే పింఛన్ చెల్లించాలి

- ఏపీ జేఏసీ అమరావతి, ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్
- సీఎస్ జవహర్ రెడ్డి, సజ్జలకు వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీ జేఏసీ అమరావతి, ఏపీ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేశాయి. పెన్షర్లకు పీఆర్సీ, డీఏ, పదవీ విరమణ ప్రయోజనాల బకాయిలు నగదు రూపంలో వెంటనే చెల్లించాలని అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్ రెడ్డిని, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని బుధవారం వేర్వేరుగా కలసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు శాస్త్రి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న దాదాపు 3 లక్షల 80 వేల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు ఇటీవల ఎన్నికయిన నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని వారికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రస్తుతం రిటైర్డు ఉద్యోగులకు సకాలంలో పెన్షన్లు, పీఆర్సీ, డీఏ తదితర బకాయిలను నేటికీ ప్రభుత్వం చెల్లించక పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (ఇహెచ్ఎస్) ద్వారా ఎవరికీ ఎలాంటి మెరుగైన సౌకర్యాలు అందడం లేదని, ప్రతి నెలా రిటైర్డ్ ఉద్యోగి పెన్షన్ నుంచి డబ్బులు చెల్లిస్తున్నప్పటికీ కనీసం ఆరోగ్యశ్రీలో ఉన్న వైద్య సౌకర్యాలు కూడా అందులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీలో ఉన్న చికిత్సలన్నీ వృద్ధులకు మెరుగైన వైద్యం కోసం ఇహెచ్ఎస్‌లోనూ చేర్చాలని, పింఛన్ దారులకు ఒకటో తేదీనే పెన్షన్ చెల్లించాలని కోరారు. అనంతరం సీఎస్ జవహర్ రెడ్డిని, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఇటీవల డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నత పొందిన అధికారులు, రెవెన్యూ అసోసియేషన్ నేతలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి, డిప్యూటీ కలెక్టర్ల తరపున అధికారులు మోహన్, మాధురి, అనిల్, రమణనాయక్, అరుణ, విజయకుమారి పాల్గొన్నారు.

తాత్కాలిక బెయిల్‌తో
విజయోత్సవ ర్యాలీలా? విజయసాయి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ కేసులో కోర్టు రిమాండ్‌లో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అనారోగ్య కారణాలతో కోర్టు నుంచి తాత్కాలిక బెయిల్ పొందితే... నిజం గెలిచిందంటూ టీడీపీ విజయోత్సవ ర్యాలీలు జరుపుకోవడం సిగ్గుచేటని వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా బుధవారం ఈ అంశంపై ఆయన స్పందించారు. జైలులో ఉన్నన్ని రోజులు దోమలు కుడుతున్నాయంటూ, చర్మరోగాలతో ఇబ్బంది పడుతున్నానని చెప్పిన చంద్రబాబు... చివరకు కంటి ఆపరేషన్ సాకుతో తాత్కాలిక బెయిల్ పై బయటకు వచ్చారన్నారు. ఆయనపై స్కిల్ కుంభకోణం కేసు యథాతథంగా ఉందన్నారు. బీజేపీని పణంగా పెట్టి టీడీపీ బలోపేతానికి పురందేశ్వరి కృషి చేస్తోందని విమర్శించారు.

ఆ ఇద్దరు ఐపీఎస్‌లపై చర్యలు తీసుకోండి
ప్రధాని మోదీకి ఎంపీ రఘురామకృష్ణరాజు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గుంటూరులో సీఐడీ కస్టడీలో తనను హింసించిన ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్ కుమార్, పీఎస్ఆర్ ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధాని మోదీకి వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు బుధవారం ఫిర్యాదు చేశారు. అప్పట్లో తనను హింసించిన వారిలో వీరిద్దరూ కూడా ఉన్నారని ఆరోపించారు. ఇద్దరు ఐపీఎస్ అధికారులపై సీబీఐ లేదా ఎన్ఐఏతో దర్యాప్తు చేయించాలని రఘురామ కోరారు. రాష్ట్ర ప్రభుత్వంపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారంటూ ఏపీ సీఐడీ రఘురామను రాజద్రోహ నేరం కింద అరెస్ట్ చేసింది. అయితే అప్పట్లో సుప్రీం కోర్టు రాజద్రోహ నేరం కింద కేసులు ఇక చెల్లవంటూ తీర్పు ఇచ్చింది. అయితే పోలీస్ కస్టడీలో తనను శారీరకంగా కొట్టి హింసించిన ఘటనపై పార్లమెంటరీ కమిటీ నేతృత్వంలో విచారణ జరిపి, ఆ ఇద్దరు ఐపీఎస్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జగన్ కేసులు మరో రాష్ట్రానికి మార్చాలి

ఏపీ సీఎం జగన్ కేసుల విచారణను మరో రాష్ట్రానికి మార్చాలంటూ ఎంపీ రఘురామ కృష్ణరాజు బుధవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ సీబీఐ కోర్టులో జగన్ కేసుల విచారణలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఎంపీ రఘురామ తెలిపారు. ఇప్పటి వరకు 3071 సార్లు జగన్ కేసును సీబీఐ కోర్టు వాయిదా వేసిందని కోర్టుకి తెలియజేశారు. జగన్ ప్రత్యక్ష హాజరుకు కూడా సీబీఐ కోర్టు మినహాయింపు ఇచ్చిందన్నారు. వందలకొద్దీ డిశ్చార్జి పిటీషన్లు వేశారని... కేసు విచారణ మరింత జాప్యం జరిగే అవకాశం ఉన్నందున ఇతర రాష్ట్రానికి ఆ కేసులన్నీ బదిలీ చేయాలని కోరారు. జగన్ కేసులపై ఈనెల 3వ తేదీన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ భట్టి అధ్వర్యంలోని సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టనున్నది.

Andhra Pradesh State Beverages Corporation Limited, Vijayawada
www.apsbcl.gov.in

AUCTION SALE NOTICE

Sealed Tenders / Bids are invited for auction sale of released carton boxes at the retail outlets of the corporation on "AS IS WHERE IS BASIS & AS IS WHAT IS BASIS". **For further details please visit the above website.**

APSBCL / Vijayawada

సీఐడీ సంజయ్, ఏఏజీ పొన్నవోలుపై చర్యల పిటిషన్
విచారణ వచ్చే వారానికి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ సీఐడీ చీఫ్ సంజయ్, అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపై చర్యలకు ఆదేశించాలంటూ హైకోర్టులో దాఖలయిన పిటిషన్‌పై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు దర్యాప్తులో ఉండగా ఈ ఇద్దరు అధికారులు ఢిల్లీ, హైదరాబాద్‌లో, స్థానికంగానూ నిబంధనలకు విరుద్ధంగా ప్రెస్‌మీట్‌లు పెట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారంటూ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు సత్యనారాయణ పిటిషన్ వేసిన విషయం విదితమే. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టగా పిటీషనర్ తరపు న్యాయవాది సీఐడీ సంజయ్, ఏఏజీ పొన్నవోలు ప్రెస్‌మీట్లతో ప్రజాధనం దుర్వినియోగం చేసిన విధానాన్ని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆర్టీఐ ద్వారా వివరాలు అడిగినా ఇవ్వడం లేదని తెలిపారు. కోర్టు అనుమతితో మరోసారి ఆర్టీఐ ద్వారా వివరాలు అడగాలని, ప్రజాధనం ఎంత వృథా అయిందో తెలపాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం వచ్చే వారానికి వాయిదా వేసింది.

చంద్రబాబు మధ్యంతర బెయిల్‌పై
సీఐడీ షరతులు హక్కుల ఉల్లంఘనే

- హైకోర్టులో ముగిసిన రెండు పక్షాల వాదనలు
- రేపు తీర్పు వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ నేపథ్యంలో మరిన్ని షరతులు విధించాలని కోరుతూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై హైకోర్టులో బుధవారం విచారణ ముగిసింది. వాదనలు విన్న ధర్మాసనం నవంబరు 3న తీర్పు వెలువరించనున్నట్టు తెలిపింది. కోర్టు ఆదేశాలను చంద్రబాబు ఎక్కడా అతిక్రమించలేదు. చంద్రబాబు మాట్లాడటం అనేది ఆయన ప్రాథమిక హక్కులలో భాగమే తప్ప అతిక్రమణ కాదు. జైలు శిక్ష పడిన వారికి కూడా మీడియాతో మాట్లాడే అవకాశం గతంలో కోర్టులు కల్పించాయి. సీఐడీ చెబుతున్న షరతులు ఆయనకున్న ప్రాథమిక హక్కులు హరించే విధంగా ఉన్నాయి. కేసు దర్యాప్తుపై ఎటువంటి ప్రభావం చూపుతుందో సీఐడీ అధికారులు చెప్పలేకపోతున్నారని చంద్రబాబు తరపు న్యాయవాదులు వాదించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత చంద్రబాబు మీడియాతో మాట్లాడారంటూ వీడియో దృశ్యాలను సీఐడీ తరపు న్యాయవాది కోర్టుకు అందజేశారు. కోర్టు ఆర్డర్ ఉన్న తర్వాత కూడా మీడియాతో మాట్లాడారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ర్యాలీలు నిర్వహించవద్దని కోర్టు ఆదేశాలు ఉన్నా రాజమహేంద్రవరం నుంచి 13 గంటల పాటు ర్యాలీగా విజయవాడకు వచ్చారని కోర్టుకు తెలియజేశారు. రెండు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తూ, నవంబరు 3న ఆర్డర్స్ ఇస్తామని తెలిపారు.

క్వాష్ పిటిషన్లపై 10వ తేదీకి విచారణ వాయిదా

మరోవైపు రాజధాని అమరావతి అసైన్డ్ భూముల కేసు వ్యవహారంలో చంద్రబాబు, మాజీ మంత్రి నారాయణ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. నవంబరు 10వ తేదీకి విచారణ వాయిదా వేస్తున్నట్లు న్యాయస్థానం తెలిపింది. కేసు రీఓపెన్ చేయాలంటూ సీఐడీ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

సంపాదకీయం

విషమ పరీక్ష

అయిదు రాష్ట్రాల శాసనసభలకు జరగనున్న ఎన్నికలు ప్రధానమైన రెండు పార్టీలు – బీజేపీకి కాంగ్రెస్ కు అగ్ని పరీక్ష లాంటివి. ఈ ఐదు రాష్ట్రాలలో విజయం బీజేపీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ. కూటమికి, కాంగ్రెస్ నాయకత్వంలోని "ఇండియా" ఐక్య సంఘటనకు ప్రధానమైనవే. ఈ ఎన్నికలు బీజేపీ మతతత్వ, విద్వేష పూరిత రాజకీయాల, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ప్రచారం చేస్తున్నట్టు "మొహబ్బత్ కా దుకాన్" విధానాల నిగ్గు తేల్చనున్నాయి. ఇంకో కోణంలో చూస్తే ఈ ఎన్నికలు రెండు ప్రధాన పార్టీలలోనూ పాత తరం నాయకులకు ఇవే ఆఖరి ఎన్నికలు కావచ్చు. వయసు రీత్యా చూస్తే తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు (కె.సి.ఆర్.)కు 69 ఏళ్లు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకుడు గెహ్లాత్ కు 72 ఏళ్లు. ఒక వేళ బీజేపీ రాజస్థాన్ లో గెలిస్తే ముఖ్యమంత్రి పదవికోసం పట్టుబట్టనున్న వసుంధరా రాజే సింధియాకు 70 ఏళ్లు. మధ్యప్రదేశ్ లో కాంగ్రెస్ లోని ఇద్దరు నాయకులు వయసు మీరిన వారే. డిగ్విజయ్ సింగ్ కు 76 ఏళ్లయితే ముఖ్యమంత్రి అభ్యర్థి అయిన కమల్‌నాథ్ కు కు 77 ఏళ్లు. వీరితో పోలిస్తే ప్రస్తుత బీజేపీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వయసు తక్కువే. కానీ అక్కడ బీజేపీ గెలిచే అవకాశం దాదాపు లేదు. ఒక వేళ ఏదో మంత్రం పనిచేసి గెలిచినా ఆయన ముఖ్యమంత్రి అయ్యే అవకాశం లేదు. చత్తీస్ గఢ్ లో ఇన్నాళ్లు బీజేపీ నాయకత్వం పక్కన పెట్టినా డా. రమణ్ సింగ్ కు చివరికి పోటీచేసే అవకాశం ఇచ్చింది. ఆయనకు 71 ఏళ్లు. పోటీ పడ్తున్న రెండు ప్రధాన పార్టీల ఎన్నికల వ్యూహం కూడా గమనించదగ్గ అంశమే. కాంగ్రెస్ లో ముందునుంచి కేంద్రంలోనే కాక రాష్ట్రాలలోనూ సకల విషయాలు నిర్ణయించేది అధిష్ఠాన వర్గమే. దీనికి భిన్నంగా వాజపేయి, అద్వాణీ నాయకత్వంలో బీజేపీ కొనసాగినప్పుడు రాష్ట్రస్థాయి నాయకులకు స్వాతంత్ర్యం ఉండేది. ఇప్పుడు కాంగ్రెస్ స్థానిక నాయకులకు ప్రాధాన్యం ఇస్తూ ఉంటే బీజేపీ మునుపు కాంగ్రెస్ అనుసరించిన అధిష్ఠాన సంప్రదాయాన్ని అనుసరిస్తోంది. మోదీ మాటే చెల్లుతుంది. లేదా ఆయన మాట చెల్లేట్టు చూడడానికి కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఉండనే ఉన్నారు. వీరిద్దరినీ దాటి ఏ స్థాయిలోనూ ఏ నిర్ణయమూ జరగదు. దీనికి మంచి ఉదాహరణ మోదీ ఇటీవలే మధ్యప్రదేశ్ ఓటర్లకు ఒక బహిరంగ లేఖ రాసి 2014, 2019లో లాగే తన ముఖం చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు. మధ్యప్రదేశ్ లో తమ పీఠం కదులుతుందని గ్రహించినందువల్లే బీజేపీ ఏడుగురు లోకసభ సభ్యులను, ఒక బీజేపీ జాతీయ స్థాయి ప్రధాన కార్యదర్శిని శాసనసభ గోదాలో దింపింది. పోటీ చేస్తున్న లోకసభ సభ్యుల్లో ముగ్గురు కేంద్ర మంత్రులే. రాజస్థాన్ లో వసుంధరా రాజే తమ ముఖ్యమంత్రి అభ్యర్థి అని బీజేపీ ప్రకటించక పోయినా బీజేపీ గెలిస్తే ఆమెను మించిన ప్రత్యామ్నాయం ఉండదు. కాంగ్రెస్ దృష్టితో చూస్తే గెహ్లాత్ కు సచిన్ పైలెట్ కు ఇటీవలి కాలం దాకా ఉప్పు–నిప్పు సంబంధాలే ఉన్నాయి. ఈ మధ్యే అధిష్ఠానం ఏదో సయోధ్య కుదిర్చినట్టుంది. అందుకే సచిన్ పైలెటు మౌనంగా ఉంటున్నారు.

ఏమైనా ఈ అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల ప్రభావం బీజేపీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ. మీద, కాంగ్రెస్ నాయకత్వంలోని "ఇండియా" కూటమి మీద 2024 ఎన్నికలలో కూడా ప్రతిఫలిస్తుంది. "ఇండియా" కూటమి అయిదు రాష్ట్రాలలో ప్రధానంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్‌లో ఎన్ని ఎక్కువ రాష్ట్రాలలో గెలిస్తే ఆ ఐక్యసంఘటన భవిష్యత్తు అంత జ్వాజ్వల్యమానంగా ఉంటుంది. సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ కనక అత్తెసరు మెజారిటీతో గట్టెక్కితే మునుపటి ఎన్.డి.ఎ. భాగస్వాముల మద్దతు కోరవలసి వస్తుంది. రెండు పక్షాలు ప్రకటిస్తున్న సంక్షేమ పథకాల ప్రభావం కూడా గట్టిగానే ఉండొచ్చు. సంక్షేమ పథకాల పేరిట ప్రజలు పన్నుల ద్వారా చెల్లించిన సొమ్మును వివిధ పథకాల పేరుతో పందేరం చేయడం రేవడి (తాయిలాల) సంస్కృతి అని మోదీ ఎద్దేవా చేశారు. అయినా ఆ తాయిలాలు ప్రకటించకుండా ఉండడం ఏ పక్షానికీ కుదిరేట్టు లేదు. కాంగ్రెస్ సంక్షేమ పథకాల వాగ్దాలు చేస్తున్న దగ్గర నుంచి మోదీ "రేవడీల" మాట ఎత్తడమే మానేశారు. ఆఖరి ప్రయత్నంగా మధ్య ప్రదేశ్ లో బీజేపీ వాగ్దానాలు చేయడంలో పోటీ పడుతోంది. మహిళా ఓటర్ల సంఖ్య పెరుగుతోంది కనక వారు ఓటు చేసే తీరు కూడా నిర్ణాయకం అవుతుంది. ఈ ఎన్నికల ఫలితాల మీద బీజేపీకన్నా దాని మాతృ సంస్థ ఆర్.ఎస్.ఎస్.కే ఎక్కువ ఆసక్తి ఉంది. 2024 ఎన్నికలలో దేశవ్యాప్తంగా బీజేపీ విజయం సాధించడానికి అయిదు రాష్ట్రాల ఎన్నికలు ఆర్.ఎస్.ఎస్. దృష్టిలో చాలా ముఖ్యమైనవి. శాసనసభల ఎన్నికల మీద కంటే ఆర్.ఎస్.ఎస్. సార్వత్రిక ఎన్నికల మీదే ఎక్కువ శ్రద్ధ చూపుతోంది. ఒక వేళ మోదీ నాయకత్వంలోని బీజేపీ సార్వత్రిక ఎన్నికలలో ఓటమి పాలైతే ఆర్.ఎస్.ఎస్. ఎందుకూ కొరకాకుండా పోతుంది. ఆ పై సంవత్సరం అంటే 2025లో ఆర్.ఎస్.ఎస్. శతవార్షికోత్సవం జరగాల్సి ఉంది. ఓటమి ఆ వార్షికోత్సవ సన్నాహాలను నీరు గార్చక తప్పదు. మోదీ, అమిత్ షా అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలను తొలి గండంగా భావిస్తూ ఉండొచ్చు. కానీ 2024 ఎన్నికలు ఆర్.ఎస్.ఎస్.కు చాలా కీలకం. అయిదు రాష్ట్రాల ఎన్నికలలో బీజేపీని గెలిపించడానికి ఆర్.ఎస్.ఎస్. సర్వ శక్తులూ ఒడ్డక తప్పడం లేదు. 2024లో బీజేపీ ఓడిపోతే ఆర్.ఎస్.ఎస్. కుదేలవుతుంది. అందుకే ఈ ఎన్నికలు ఆర్.ఎస్.ఎస్.కు సైతం జీవన్మరణ సమస్యే. మోదీ–షా చూపు శాసనసభ ఎన్నికల మీద ఉంటే ఆర్.ఎస్.ఎస్. లక్ష్యం 2024 ఎన్నికలలో విజయం సాధించడమే. పైగా మోదీ మీద ఉన్న భ్రమలు ఆర్.ఎస్.ఎస్.కు క్రమగా తొలగిపోతున్నాయి. ప్రత్యామ్నాయ నాయకుడి కోసం ఆలోచనలు సాగుతున్నాయన్న వార్తలు తరచుగా వస్తున్నాయి. ఎన్నికల సమరాంగణంలో ఏదో ఒక పక్షం మాత్రమే గెలవవచ్చు. గెలిచిన పక్షం సంబరాలు చేసుకోవచ్చు. ప్రజల దృష్టితో, దేశ భవిష్యత్తు దృష్టితో చూస్తే మతతత్వ, విద్వేష రాజకీయాలు కొనసాగించే బీజేపీ ఓటమి అత్యవసరం. మూడోసారి మోదీ అధికారంలోకి వస్తే ఈ రెండు ఉపద్రవాలు మరింత విలయ నర్తనం చేస్తాయి. తక్షణావసరం ప్రజాస్వామ్య, రాంజ్యాగ, సెక్యులర్ తత్వం పరిరక్షణే. మన ఓటర్లకు ఈ తేడా గమనించే వివేకం ఉంది.

చత్తీస్‌గఢ్‌లో వాగ్దానాల వరద

మక్కెన సుబ్బారావు

ఐదు రాష్ట్రాలలో అసెంబ్లీలకు జరగనున్న ఎన్నికల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగే ఏకైక రాష్ట్రం చత్తీస్‌ఘడ్. 2000 సంవత్సరంలో మధ్యప్రదేశ్ నుండి విడదీసి ఏర్పాటుచేసిన ఈ గిరిజన ప్రధాన రాష్ట్రం బీజేపీ అడ్డా. కాంగ్రెస్ బలమైన ప్రత్యర్థి. గడచిన 23 సంవత్సరాల్లో రెండు పర్యాయాలు కాంగ్రెస్ (అజిత్‌జోగి, ప్రస్తుత ముఖ్యమంత్రి భూపేష్ భగెల్), రెండుసార్లు బీజేపీ (రమణ్‌సింగ్) అధికారం చేబట్టాయి. వామపక్ష తీవ్రవాదానికి స్థావరమైన బస్తర్ రీజియన్ ఈ రాష్ట్రంలోనిదే. అందువల్లనే నవంబరు 7న 20 నియోజకవర్గాల్లో, నవంబరు 17న మిగిలిన 70 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నది. హిందీ బెల్ట్‌గా పరిగణించే రాష్ట్రాల్లో చత్తీస్‌ఘడ్ ఒకటి. వచ్చే లోకసభ ఎన్నికల ప్రాధాన్యత దృష్ట్యా, అధికారంకోసం కాంగ్రెస్, బీజేపీ హెూరాహెూరీ పోరాటం చేస్తున్నాయి. బహుజన్ సమాజ్‌పార్టీ, గోండ్వానా గణతంత్ర పార్టీ అలయన్స్, కీ.శే.అజిత్ జోగి నెలకొల్పిన జనతా కాంగ్రెస్ చత్తీస్‌ఘడ్(జె) లేదా జెజె, మాజీ కేంద్రమంత్రి అరవింద్ నేతలు ఏర్పాటుచేసిన హమర్ రాజ్ పార్టీ, ఆప్, సీపీఐ, సీపీఐ(ఎం) వంటి పార్టీలు కాంగ్రెస్, బీజేపీయేతర ఓట్లు పంచుకుంటున్నాయి. 2018 ఎన్నికల్లో ఈ పార్టీలకు పోలైన సీట్లలో 24శాతం లభించటం గమనార్హం,

అయినా ప్రధాన పాత్రధారులైన కాంగ్రెస్ ప్రధానంగా సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేస్తుండగా, బీజేపీ సంక్షేమానికి మత విభజనలు జోడిస్తూ భావోద్రేకాలతో ఓట్లు పొందాలని చూస్తోంది. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఏ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి వచ్చినా ముస్లిం వ్యతిరేక ప్రస్తావనలను తేలుకొండిలా ఉపయోగించక మానడు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హింతబిశ్వశర్మ పదునైన నాలుకలకు ఆయన ఆదర్శం. బిశ్వశర్మ ఒక మంత్రిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యానాలను ఎన్నికల సంఘం ఆయనకు నోటీసు ఇచ్చింది. అయితే చత్తీస్‌ఘడ్‌లో ముస్లింలు 7–8శాతం ఉన్నందున బీజేపీ ఇక్కడ ఓబీసీ ఎజెండాను ప్రధానం చేసింది. అమిత్ షా ఇటీవల హైదరాబాద్ సభలో కూడా ఓబీసీ ముఖ్యమంత్రిని ఎజండాలోకి తెచ్చారు.

పాలక కాంగ్రెస్ గో సంరక్షణ, గో మలం కొనుగోలువంటి సాఫ్ట్ హిందూత్వ కార్యక్రమాలతోపాటు, వ్యవసాయ రుణాల రద్దు, ధాన్య సేకరణకు బోనస్, మహిళలకు ప్రోత్సాహకాలు వగైరా సంక్షేమ కార్యక్రమాలను అమలు జరుపుతోంది. ఇప్పుడు వాటిని మరింతగా మెరుగు పరచటంతోపాటు కర్నాటక ఎన్నికల నుండి వ్యూహాత్మకంగా ప్రయోగిస్తున్న 'భరోసా'ను ప్రకటించింది. అయితే ఎంత చేసినా, ఏమి చెప్పినా అందర్నీ సంతృప్తి పరచటం సాధ్యంకాదు కావున, ఎమ్మెల్యేల పనితీరునుబట్టి వ్యతిరేకత తలెత్తుతూనే ఉంటుంది. దాన్ని అధికమించేందుకై కాంగ్రెస్ పార్టీ తమ 71 ఎమ్మెల్యేల్లో 22 మందిని మార్చివేసింది.. బీజేపీ కూడా తమ 13 మందిలో ఇద్దరు సిట్టింగ్‌లను మార్చింది. కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారంకోసం విస్తృతంగా ప్రచారంచేస్తున్న రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలోని 'ఉచితాల'ను ప్రజలు ముందుకు తీసుకెళుతున్నారు. వాటిలో కొన్ని వ్యవసాయ రుణాల రద్దు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో కేజీ టు పీ ఉచిత విద్య రెండూ (బీడీ)ఆకు సేకరించే శ్రామికులకు రూ. 4000 (ఉచిత వైద్యం, ధాన్య సేకరణకు క్వింటాల్‌కు రూ.3వేలు (ప్రస్తుతం రూ.2650), పేదలకు రూ.10లక్షలవరకు, ఇతరులకు రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం, భూమి లేదా రైతులకు సహాయం రూ.7 వేల నుంచి రూ.10వేలకు పెంపుదల అన్నిటికీ మించి కులజనణన.

మహిళా ప్రాతినిధ్యం:

రద్దుకాబోతున్న శాసనసభలో 90మంది ఎమ్మెల్యేల్లో 16 మంది (17.7శాతం) మహిళలు మరో ఇద్దరు ఉపఎన్నికల్లో గెలిచారు. ఈ శాతం మరే రాష్ట్రంలో లేదు. స్థానిక సంస్థల్లో 1991 నుండి అమలులోఉన్న 33శాతం మహిళా రిజర్వేషన్‌లు 2008లో 50శాతానికి పెంపుచేశారు. అయితే బస్తర్ రీజియన్‌లో పరిస్థితి భిన్నం. ఇక్కడ ఓటర్లలో మహిళలు 10.4లక్షలు, పురుషులు 9.87లక్షలు. మొత్తం 12 అసెంబ్లీ స్థానాలుండగా బీజేపీ, కాంగ్రెస్‌లు కలిసి ఇద్దరు మహిళలకే టిక్కెట్లు ఇచ్చాయి. నవంబరు 7న పోలింగ్ జరుగుతుంది. గిరిజన సొసైటీల్లో స్త్రీలకు సమాన హక్కులున్నాయి. కుటుంబాల నిర్వహణలో వారిదే కీలకపాత్ర. అయినా చట్టసభల వచ్చేసరికి నామమాత్రపు ప్రాతినిధ్యం. పార్లమెంటు 33శాతం మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఆమోదించినా అది కనీసం మరో పదేళ్లు అందని ద్రాక్షే. కాంగ్రెస్, బీజేపీ రెండు ఈ పర్యాయం గతం కన్నా ఎక్కువమంది మహిళలను (కాంగ్రెస్‌కు 14నుండి 18, బీజేపీ 13నుండి 14) నామినేట్ చేశాయి. ఓటర్లు ఎంతమందిని గెలిపిస్తారో డిసెంబరు 3వరకు వేచి చూద్దాం.!

సీనియర్ జర్నలిస్టు

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ

శిరందాసు నాగార్జున

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) హ్యాట్రిక్ సాధించే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పుంజుకొని బిఆర్ఎస్‌తో పోటీపడుతుందటున్నారు. తెలంగాణ సాధించిన పార్టీగా ఇప్పటివరకు బిఆర్ఎస్‌కు గుర్తింపు ఉంది.అయితే, ఆశించిన స్థాయిలో తమ జీవితాలు మెరుగుపడలేదన్న భావన అన్నివర్గాల్లో నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఆ పార్టీ గెలుపు అంత తేలికగా కనిపించడంలేదు. ప్రభుత్వంపైన, బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు చాలా మందిపై తీవ్రవ్యతిరేకత వ్యక్తమవుతోంది. అనేక మంది భూములు ఆక్రమించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పథకాలు అన్నీ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారన్నది ప్రజల ఆరోపణ. చాలా పథకాలు పూర్తి స్థాయిలో అమలు కాకపోవడం, పథకాల అమలులో అవకతవకలు జరగడం వల్ల బీఆర్ఎస్ ప్రభుత్వం అంటే తీవ్రవ్యతిరేకత ఏర్పడింది. అనేక వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైంది. జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ వారికి 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిజాంపేట, పేట్ బషీరాబాద్‌లలో భూమి కేటాయించింది. సొసైటీవారు ఆ భూమికి అప్పటి మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వానికి డబ్బు చెల్లించారు. సుప్రీంకోర్టు కూడా ఏడాది క్రితం సొసైటీకి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ భూమిని సొసైటీకి అప్పగిస్తామని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కూడా నమ్మబలికారు. ఒక్క నిజాంపేట భూమిని మాత్రమే ఈ ప్రభుత్వం సొసైటీకి అప్పగించింది. పేట్ బషీరాబాద్ భూమిని ఇప్పటి వరకు అప్పగించలేదు. ఈ సొసైటీలో దాదాపు 1100 మంది సభ్యులు ఉన్నారు. వారిలో 70మంది వరకు తనువు చాలించారు. హైదరాబాద్‌లోని మిగిలిన జర్నలిస్టులు కూడా సొసైటీ ఏర్పాటు చేసుకుంటే భూములు ఇస్తామని ఈ ప్రభుత్వం చెప్పింది. వారు సొసైటీలు ఏర్పాటు చేసుకున్నారు. భూమి మాత్రం కేటాయించలేదు. దాంతో జర్నలిస్టులలో అత్యధిక మంది ఈ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. దాంతోపాటు నిరుద్యోగ సమస్య, ఉపాధి లభించక యువత చాలా నిరుత్సాహంగా ఉన్నారు. టికెట్ల కేటాయింపులో బీసీలు, మహిళలతోపాటు చాలా వర్గాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇలా ఒకరేమిటి అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారు.



బీఆర్ఎస్ మేనిఫెస్టో కూడా అంత ఆశాజనకంగా లేదు. పాత పథకాలు కొనసాగిస్తామని, ప్రజలందరికీ బీమా సౌకర్యం, ఆరోగ్యశ్రీ గరిష్ట పరమితి రూ.15 లక్షలకు పెంచుతామని, పేద మహిళలకు, జర్నలిస్టులకు రూ.400కే గ్యాస్ సిలిండర్, పేద మహిళలకు రూ.3వేల గౌరవ భృతి, రేషన్ కార్డుపై సన్న బియ్యం, రైతుబంధు, దివ్యాంగుల పెన్షన్, ఆసరా పెన్షన్‌ల పెంపు వంటి హామీలు ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు సాధ్యాసాధ్యాలు అధ్యయనం చేయడానికి ఒక కమిటీ నియమిస్తామని చెప్పారు. అసైన్డ్ భూములపై ఆంక్షలు ఎత్తివేతకు ప్రయత్నం చేస్తామని మాత్రం హామీ ఇచ్చింది. ఈ హామీలన్నిటికీ మెలికలు పెట్టారు. అందువల్ల ఓటర్లు వాటిని నమ్మే పరిస్థితుల్లో లేరంటున్నారు.

జనంలో వ్యతిరేకత బాగా ఉంది. ఎన్నికల సర్వేలలో అధిక శాతం కాంగ్రెస్‌కు అనుకూలత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్యేలు,జడ్పీ చైర్మన్, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలతోపాటు పలుకు బడికలిగిన ముఖ్యనేతలు, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అనేక మంది బీఆర్ఎస్‌కు రాజీనామాచేసి అత్యధిక మంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.

బీఆర్ఎస్ పై వ్యతిరేకత కాంగ్రెస్ పార్టీకి కలిసివస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి రాష్ట్రపార్టీలో ఓ ఊపు తెచ్చారు. దానికితోడు బీఆర్ఎస్‌పై అసంతృప్తి, భారీస్థాయిలో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరడం...వంటి అంశాలన్నీ కాంగ్రెస్‌కు కలిసివస్తున్నాయి. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు పథకాలహామీ కూడా ఓటర్లలోకి బాగా చొచ్చుకు వెళ్లింది. మహిళలు, యువతపై వారు ప్రత్యేక దృష్టి పెట్టారు. మహిళా పథకాలు పక్క రాష్ట్రం కర్ణాటకలో అమలు చేయడంతో ఆ పార్టీపై నమ్మకం పెరిగిందంటున్నారు. ఎన్నికల సర్వేల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి 70 స్థానాల వరకు వచ్చే అవకాశంఉంది.

సీనియర్ జర్నలిస్ట్ 9440222914

అధ్వానస్థితిలో ఉత్పత్తి

డా.జ్ఞాన్ పాఠక్

దాదాపు గత 8నెలలకుపైగా దేశంలో ఉత్పత్తిరంగం అధ్వాన్నస్థితిలో ఉన్నది. పండుగల సీజన్‌లో ప్రత్యేకించి ఈ సంవత్సరం మొదటి నెలనుండి ఉత్పత్తిరంగం వేగవంతమవుతున్నదని ఆశించినప్పటికీ ఆ విధంగా జరగలేదు. ఆర్థిక సంవత్సరంలో ఆర్థికమాంద్యం నెలకొంది. అక్టోబరులో కొన్ని తరహాల ఉత్పత్తి వృద్ధికి డిమాండ్ దోహదం చేస్తున్నదని భావించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఎస్అండ్‌పి గ్లోబల్ ఉత్పత్తి సూచికసంస్థ నవంబరు 1న విడుదల చేసిన నివేదిక ప్రకారం, కొనుగోలు నిర్వహణ సూచీ అతి తక్కువగా ఉన్నది. కొత్త ఆర్డర్‌ల పెరుగుదల లేకపోవడం, ఉత్పత్తి, ఎగుమతులు కొనుగోలు స్థాయిలు, స్టాక్‌రంగంలో కొనుగోలు సక్రమంగా లేకపోవడంతో ఉత్పత్తి పెరుగుదల చాలా మందంగా ఉన్నది. కొనుగోలు నిర్వహణ సూచీ అక్టోబరులో 50.5శాతం మాత్రమే ఉంది. ఇది అంత అధ్వాన్నం కాకపోయినప్పటికీ, 50కిపైన ఉండటం ఉత్పత్తి విస్తరణకు సూచిక అవుతుందని భావిస్తున్నారు. సెప్టెంబరులో 57.5శాతం కొనుగోలు నిర్వహణ సూచీ ఉన్నది. ఈ సంవత్సరం ఫిబ్రవరి నుంచి ఇది చాలా నెమ్మదిగా పెరిగింది.

నెలవారీ సర్వే ప్రకారం చూసినట్లయితే 8వ నెలవరకు కొన్ని పరిశ్రమల ఉత్పత్తులకు తక్కువ డిమాండ్ ఉన్నది. సెప్టెంబరు నుంచి కొత్త ఆర్డర్లు లేకపోవడంతో ఉత్పత్తి పెరుగుదల సక్రమంగా లేదు. తీవ్రమైన పోటీ, కొన్ని ఉత్పత్తులు తగ్గడం వలన డిమాండ్ కూడా తగ్గింది. రోజువారీ వినిమయ వస్తువుల కొనుగోలుకూడా ముమ్మరంగా లేకపోవడం ఉత్పత్తుల వృద్ధిపై ప్రభావం చూపింది. గత నాలుగు నెలల తరావాత అక్టోబరులో ఇంతవరకు బలహీనంగాఉన్న అంతర్జాతీయ విక్రయాలు పెరిగాయి. ఆసియా, ఐరోపా, పశ్చిమాసియా, అమెరికాలనుంచి ఆర్డర్లురావడం అక్టోబరునుంచి ప్రారంభమైంది. అక్టోబరులో వెల్లడైన సమాచారం ప్రకారం, కొత్త వాణిజ్యాలు పెరిగాయి. ఉత్పత్తులను మరింత పెంచడానికి కృషి జరుగుతోంది. కొంచెం ఉద్యోగులను తీసుకునే కంపెనీలు పెరిగాయి. నాలుగుశాతం కంపెనీలు అదనంగా సిబ్బందిని తీసుకుంటున్నాయి. అయితే కార్మికవర్గం అత్యధికంగా పనులులేని పరిస్థితి అలాగే ఉంది. ఏప్రిల్‌నుంచి ఉద్యోగ నియామకాలు అత్యంత నెమ్మదిగా జరుగుతున్నాయి. అక్టోబరులో అదనంగా ఉత్పత్తుల కొనుగోళ్లకు అవసరమైన వస్తువుల ఉత్పత్తి షెడ్యూల్స్‌ను అందుకోవడానికి సకాలంలో ఆర్డర్లను పూర్తిచేసి ఎగుమతి చేసేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. ధరలు కూడా మిశ్రమంగా ఉన్నాయి. ఇదే సమయంలో ఉత్పత్తులకు ముడిసరుకుల వ్యయం, ఉత్పత్తులకు చేసే ఖర్చు పెరిగాయి. ద్రవ్యోల్బణం కారణంగా ఫ్యాక్టరీ ధరలు పెరిగి అనంతరం బలహీనంగా ఉన్నాయి. లిస్ట్ చేసిన పదార్థాల ధరలు ఉదాహరణకు అల్యూమినియం, రసాయనాలు, పేపర్లు, రబ్బర్లు, స్టీలు ధరలు పెరిగాయి. దేశంలో వ్యాపార సెంటిమెంట్ స్థిరంగా ఉంది. అక్టోబరులో ఉత్పత్తి రంగం సాధించిన ఉత్పత్తి గణనీయంగా వృద్ధి సాధిస్తున్నదని ఎస్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఆర్థికవిభాగం డైరెక్టర్ పాలియన్నా డి లిమా మాట్లాడుతూ, ప్రపంచార్థిక పరిస్థితి సక్రమంగా లేకపోయినప్పటికీ భారతదేశంలో వృద్ధిరేటు మేలుగా ఉన్నదన్నారు.

బీజేపీని ముంచనున్న ధరలు

డా. యం.సురేష్ బాబు

బీజేపీకి వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు అగ్ని పరీక్షగా నిలవనున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఓవైపు ఐక్యంగా ముందుకు వెళ్లేందుకు విపక్ష పార్టీలు ప్రయత్నాలు చేస్తుంటే. మరోవైపు బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ధరల పెంపుదలతోపాటు ఇంధన ధరల పెంపు, ద్రవ్యోల్బణంతో నిత్యావసరాల ధరల పెరుగుదల, దేశంలో పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, తదితర అంశాలపై ప్రజల్లో ఉన్న ఆగ్రహం ఈసారి కమలంపార్టీకి బుద్ధిచెప్పే అవకాశం కనిపిస్తున్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కేంద్రంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ గత కొద్ది సంవత్సరాలుగా ధరల స్థిరీకరణ అనేది లేక పేద మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నిరాశ నిస్పృహలకు లోనయ్యారు. టమోటా, ఉల్లి, బంగాళా దుంప ఒక వారం వంద రూపాయలు, మరోవారం రవాణా ఖర్చులకు రాక రాత్రికి రాత్రే రోడ్డు వెంబడి సరుకు వదిలేసి వెళ్లిన దుస్థితి దేశవ్యాప్తంగా కనిపిస్తున్నది. కష్ట సమయాల్లో బఫర్ స్టాక్ ఎంత ఉందని ప్రభుత్వం దగ్గర లెక్కలులేవు. సరఫరా గొలుసు నిర్వమణ సరిగా లేక ఒక చోట రెండు వందల ఉంటే అదే సరుకు యాభై లోపల ఇంకొక చోట ఉంటుంది. ధరల నియంత్రణలు అనేది మార్కెట్‌లో వస్తువులు, సేవలకు వసూలు చేయగల ధరలపై ప్రభుత్వాలు విధించిన అమలుచేసే పరిమితులు. అటువంటి నియంత్రణలను అమలు చేయడం వెనుక ఉద్దేశ్యం కొరత సమయంలో కూడా వస్తువుల స్తోమతను కొనసాగించాలనే కోరిక నుండి ఉత్పన్నమవుతుంది. ద్రవ్యోల్బణం నెమ్మదిస్తుంది లేదా ప్రత్యామ్నాయంగా, నిర్దిష్ట వస్తువులను అందించేవారికి కనీస ఆదాయాన్ని నిర్ధారించడం లేదా జీవన వేతనం సాధించడానికి ప్రయత్నించడం. ధర నియంత్రణలో రెండు ప్రాథమిక రూపాలున్నాయి: ధర సీలింగ్– గరిష్టంగా వసూలు చేయగల ధర అంతస్తు, ఛార్జ్ చేయగల కనీస ధర. ధరల పరిమితికి ఒక ప్రసిద్ధ ఉదాహరణ అద్దె నియంత్రణ. ఇది అద్దెను వసూలు చేయడానికి భూస్వామ్య ప్రభుత్వం అనుమతించిన పెరుగుదలను పరిమితం చేస్తుంది. విస్తృతంగా ఉపయోగించే ధర అంతస్తు కనీస వేతనం (వేతనాలు శ్రమ ధర). చారిత్రాత్మకంగా, వేతన నియంత్రణలు, ఇతర నియంత్రణ అంశాలను కూడా ఉపయోగించే పెద్ద ఆదాయ విధాన ప్యాకేజీలో భాగంగా ధర నియంత్రణలు తరచుగా విధిస్తారు. ధరల నియంత్రణలను ప్రభుత్వాలు మామూలుగా ఉపయోగిస్తున్నప్పటికీ, పాశ్చాత్య ఆర్థికవేత్తలు సాధారణంగా వినియోగదారుల ధరల నియంత్రణలు మార్కెట్ ఆర్థిక వ్యవస్థల్లో తాము అనుకున్నది సాధించలేవని అంగీకరిస్తారు. చాలా మంది ఆర్థికవేత్తలు బదులుగా అలాంటి నియంత్రణలను నివారించాలని సిఫార్సు చేస్తున్నారు.



ఉత్తరప్రదేశ్‌లో రైతులను తొక్కించి చంపడం ప్రజలు మర్చిపోరు. మోదీ ప్రభుత్వానికి ఇచ్చిన సమయం చాలని ప్రజలు భావిస్తున్నారని విశ్లేషకులు అంటు న్నారు. బ్రిజ్‌భూషణ్ వ్యవహారం, మణిపూర్‌లో హింసాకాండ అంశాల్లో కేంద్ర నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహంగా ఉన్నారని విశ్లేషించారు. ధరల నియంత్రణ చర్యలకు ప్రభుత్వంలో భాగం అనుకూలంగాలేదని ఆర్థిక సలహా మండలి సభ్యులు రవి తెలిపారు. ఆహార పదార్థాల ధరలను అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు తీసుకుంటున్న తరుణంలో రవి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రభుత్వంలో కొంత భాగం ధరల నియంత్రణ చర్యలకు అనుకూలంగా లేదు, ఆగస్టు 25న మనీకంట్రోల్ పాలసీ తదుపరి సెషన్‌లో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యురాలు షమిక రవి అన్నారు. అలాంటి చర్యలు ఎక్కువ కాలం ఉండవని ఆమె అన్నారు. ఒక సమయంలో పరిష్కారం ఎక్కువ కాలంపాటు ఉండకపోవచ్చు. ఏజన్సీల ద్వారా నిర్దిష్ట టమోటా స్టాక్‌లకు రిటైల్ ధరలను తగ్గించడం, నిర్దిష్ట వర్గం బియ్యం ఎగుమతిపై నిషేధాన్ని అమలు చేయడం వంటి ఆహార ధరలను నియంత్రించడం కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు తీసుకున్న తరుణంలో ఇలాంటి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడానికి బహిరంగ మార్కెట్ విక్రయ పథకం కింద గోధుమలను విక్రయిస్తున్నట్లు. కూరగాయల ధరల పెరుగుదల, పప్పులు, తృణధాన్యాలు వంటి కీలకమైన వస్తువుల ధరల స్థిరమైన ఒత్తిడి కారణంగా జూలైలో భారతదేశం ప్రధాన రిటైల్ ద్రవ్యోల్బణం 15 నెలల గరిష్ట స్థాయి 7.44 శాతానికి చేరుకుంది. ఆగస్టులో కూడా ద్రవ్యోల్బణం 7శాతం కంటే ఎక్కువగా ఉంది. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా వినియోగదారులను రక్షించడానికి తరచుగా తీసుకుంటున్న చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రస్తుతం రైతుల ఆదాయం చాలా సంక్లిష్టంగా మారింది. అటువంటి షాక్‌ల నుండి సమాజాన్ని రక్షించడానికి ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను ప్రవేశపెట్టడానికి ప్రయత్నించింది, వ్యతిరేకత కారణంగా ఉపసంహరించారు. జీడీపీ వృద్ధి పరంగా దేశం అద్భుతమైన పనితీరు కలిగిఉంది. దేశం గతంలో దాదాపు 6–7 శాతం వృద్ధిస్థాయిని సాధించినప్పటికీ, గ్లోబల్ మందగమనం మధ్య కూడా ఇదే విధమైన వృద్ధి రేట్లు ఆశావాదానికి హామీ ఇస్తున్నాయి. భారతదేశం జిడిపి వృద్ధికి సంబంధించిన అనేక గ్లోబల్ ఏజెన్సీలు తమ అంచనాలను పెంచడంలో ఆశ్చర్యంలేదు. ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ జనవరి–మార్చిలో వృద్ధి సంఖ్య కారణంగా 2023–24 కోసం భారతదేశానికి జీడీపీ వృద్ధి అంచనాను 5.9 శాతం నుంచి 6.1 శాతానికి పెంచింది. జనవరి–మార్చి భారత ఆర్థిక వ్యవస్థ 6.1 శాతం వృద్ధి చెందిందని తెలిపింది.

ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

అండగా ఉండే అభ్యర్థికే ప్రాధాన్యం

- పథకాలను చూసి ఓట్లు వేయం
- ప్రతాప్‌గఢ్ నియోజకవర్గంలో రైతుల మనోగతం

ప్రతాప్‌గఢ్: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు నవంబరు 25న జరుగనుండగా వివిధ పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మారుమూల గ్రామీణ ప్రాంత ఓటర్లు ఏమంటున్నారంటే... ప్రభుత్వ పథకాల కన్నా కూడా నిత్యం తమకు అందుబాటులో ఉండే అభ్యర్థిని బలపరుస్తామని చెబుతున్నారు. ఇక్కడి మారుమూల వర్మండల్ గ్రామంలో తన పొలాన్ని దున్నుతున్న 55 ఏళ్ల కైలాష్‌ను పీటీఐ పలకరించింది. ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తారని అడగ్గా... రైతులకు ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి తనకు బాగా తెలుసునని... అయితే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఆ పార్టీకి ఓటు వేస్తానని హామీ ఇవ్వలేనని బదులిచ్చాడు. 'ఎమ్మెల్యే కాగోరు అభ్యర్థి అందుబాటులో ఉండాలి. నా ఓటు వేయడానికి ముందు అభ్యర్థిలో నేను చూసే మొదటి విషయం ఇదే' అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు మొబైల్ ఫోన్లు ఇచ్చింది కానీ కొందరికే పరిమితం కావడంతో రానివారు నిరాశ చెందారు. అయితే, రూ. 25 లక్షల ఆరోగ్య బీమా కవరేజీని అందించే చిరంజీవి పథకం వంటి కార్యక్రమాలు ప్రజలకు మేలు చేశాయని ఆయన పేర్కొన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోవడం ఈ ప్రాంత ప్రజలకు కష్టమని, ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్య రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. ప్రతాప్‌గఢ్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే వర్మండల్‌లో కైలాష్ ఒక్కరే కాదు. పీటీఐతో మాట్లాడిన ఇతర వ్యక్తులు కూడా అభ్యర్థులకు ఓటర్లతో ఉన్న అనుబంధమే... ఫలితాన్ని నిర్ధారిస్తుందన్నారు. మరో రైతు బన్వారీ శర్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అభ్యర్థి కంటే స్థానిక అభ్యర్థి ఎవరన్నదే ముఖ్యమని స్పష్టం చేశారు. 'ప్రజలు ఉపాధి హామీ పనిని కోరుకుంటున్నారు. అవసరమైన సమయంలో స్థానిక ఎమ్మెల్యే వారికి అండగా ఉండాలి. ఆదాయ వనరులు ఇక్కడ చాలా తక్కువ. పురుషులు జీవనోపాధి కోసం గుజరాత్, మధ్యప్రదేశ్‌లకు వెళతారు. మహిళలు పొలాల్లో పనిచేస్తారు. ఎమ్మెల్యే అందుబాటులో ఉంటే ప్రజల పనులు సులువుగా జరుగుతాయి. అందుకే అందుబాటులో ఉండే వ్యక్తి తమ ఎమ్మెల్యే కావాలని ఇక్కడి వారు కోరుకుంటున్నారు' అన్నారు. రోడ్డు మరమ్మతులు, ఇతర ప్రభుత్వ సంబంధిత పనులు సులభంగా చేయాలని భావిస్తున్నట్లు శర్మ చెప్పారు.

2018లో బీజేపీ కంచుకోటకు బీటలు

ఆరుసార్లు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నంద్‌లాల్ మీనా కుమారుడు హేమంత్ మీనాను 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంలాల్ మీనా ఓడించడానికి ముందు ప్రతాప్‌గఢ్ అసెంబ్లీ నియోజకవర్గం అనేక ఏళ్లపాటు బీజేపీ కంచుకోటగా ఉంది. నంద్‌లాల్ మీనా 1980లో ఈ సీటును గెలుచుకున్నారు. ఆపై 1993 నుంచి 2018 వరకు క్రమం తప్పకుండా గెలిచారు. ఈసారి కూడా రాంలాల్ మీనా, హేమంత్ మీనా పోటీ పడుతున్నారు. రాంలాల్ మీనా సీటును నిలబెట్టుకుంటాననే నమ్మకంతో ఉన్నారు. ప్రతాప్‌గఢ్ నియోజకవర్గంలో గత ఐదేళ్లలో కళాశాలలు, రాష్ట్ర రహదారులు, జిల్లా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ వార్డు, కొత్త పంచాయతీ, ఎస్‌డీఎం కార్యాలయాల నిర్మాణంతో పాటు చాలా పనులు జరిగాయని ఆయన చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో అన్నపూర్ణ ఫుడ్ ప్యాకెట్ పథకానికి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఆకాశాన్నంటుతున్న ద్రవ్యోల్బణం పేదలపై పెనుభారాన్ని మోపిందని, ఇక్కడి ప్రజలకు ఆదాయ వనరులు అంతంత మాత్రమే కావడంతో ప్రభుత్వం ప్రారంభించిన ఉచిత ఫుడ్ ప్యాకెట్ పథకానికి భారీ స్పందన లభించిందని, ఈసారి తాను గెలుస్తానని రాంలాల్ మీనా విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా తన ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి రాంలాల్ మీనా అవినీతిలో కూరుకుపోయాడని బీజేపీ అభ్యర్థి హేమంత్ మీనా ఆరోపించారు. రాంలాల్ మీనా కేవలం డబ్బులు దండుకున్నారు తప్ప మరేమీ చేయలేదని, ప్రజలు ఈసారి బీజేపీకి పట్టం కట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని నమ్ముతున్నానన్నారు. షెడ్యూల్డ్ తెగలకు రిజర్వ్ చేయబడిన ప్రతాప్‌గఢ్ సీటులో 2.57 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ప్రతాప్‌గఢ్ జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇది ఒకటి, మరొకటి ధరియావాడ్. 200 మంది సభ్యులున్న రాజస్థాన్ అసెంబ్లీకి నవంబర్ 25న పోలింగ్ నిర్వహించనుండగా డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది.

5 వేల మంది మున్సిపల్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దీపావళి కానుక ఇచ్చారు. 5 వేల మంది కాంట్రాక్టు వర్కర్ల ఉద్యోగాలను పర్మనెంట్ చేస్తున్నట్టు కేజ్రీవాల్ బుధవారం ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని, ఈ విధానానికి ముగింపు పలకాలనే సంకల్పంతో ఆప్ సర్కార్ మొదట్నించీ ఉందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్నప్పుడు ఎంతో అవినీతి ఉండేదని, ఇప్పుడు ఉద్యోగులంతా సకాలంలో వేతనాలు పొందుతున్నారని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్ సమావేశం మంగళవారం జరిపామని, 5,000 మంది పారిశుధ్య కార్మికులను పర్మనెంట్ చేయాలనే ప్రతిపాదనను సమావేశంలో ఆమోదించామని కేజ్రీవాల్ చెప్పారు. 2023 జనవరి నుంచి 6,494 మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించామని కేజ్రీవాల్ తెలిపారు. సీఎం ప్రకటనతో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల కుటుంబాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

బీజేపీ పాలనలో ధరలు ఆకాశాన్నంటాయి

2024లో ప్రజలు మార్పునకు సిద్ధమయ్యారు

కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్

న్యూఢిల్లీ : కేంద్రంలోని బీజేపీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని కాంగ్రెస్ పార్టీ బుధవారం విమర్శించింది. 2024 ఎన్నికల్లో ప్రజలు మార్పునకు సిద్ధంగా ఉన్నారని, ద్రవ్యోల్బణాన్ని పెంచే విధానాలను 'ఇండియా' కూటమి ప్రభుత్వం తక్షణమే మారుస్తుందని నొక్కి చెప్పింది. ఉల్లి, పప్పులు, పంచదార ధరలు పెరగడంతో పండుగల సీజన్‌లో గృహాల బడ్జెట్ అస్తవ్యస్తంగా మారిందని ఒక మీడియా కథనాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 'మోదీ ప్రభుత్వ హయాంలో ఆనందాన్ని పంచే పండుగలు కూడా ప్రజల ఆందోళనలను పెంచుతున్నాయి. ఎందుకంటే ప్రతి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి' అని రమేశ్ హిందీలో సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఉల్లి ధరలు 90 శాతానికి పైగా పెరిగిన రూ.100కు చేరువలో ఉన్నాయని, కంది పప్పు ధర ఏడాదిలో 40 శాతం పెరిగి రూ.152కు చేరిందని తెలిపారు. అయితే ఇప్పుడు ఇదే చివరి దీపావళి అని, ధరల పెరుగుదలతో ప్రజలు ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. 'ప్రజలు ఈ ప్రభుత్వంతో విసిగిపోయారు. 2024 మార్పునకు సిద్ధంగా ఉన్నారు. ద్రవ్యోల్బణాన్ని పెంచే విధానాలను, అలాగే, ప్రధానమంత్రి స్నేహితుడికి ప్రయోజనం చేకూర్చే విధానాలను 'ఇండియా' కూటమి తక్షణమే మారుస్తుంది. సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగిస్తుంది' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థను నిర్వహించడంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించడంతో పాటు నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ఆందోళనలు లేవనెత్తుతోంది.

జారంగే దీక్ష విరమించుకోవాలి

- మరాఠా కోటాపై సమావేశంలో అఖిలపక్షం తీర్మానం
- రిజర్వేషన్ల అమలుకు సమయం కావాలి : సీఎం షిండే

ముంబై : మరాఠా కోటాపై కార్యకర్త జారంగే తన నిరవధిక నిరాహార దీక్షను విరమించుకోవాలని అఖిలపక్ష సమావేశం కోరింది. బుధవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అధ్యక్షతన జరిగిన మరాఠా కోటాపై అఖిలపక్ష సమావేశంలో నాయకులు మనోజ్ జారంగే తన నిరవధిక నిరాహార దీక్షను విరమించాలని కోరుతూ తీర్మానం చేశారు. మరాఠా కోటాకు రాష్ట్ర ప్రభుత్వం అనుకూలంగా ఉందని ముంబైలో జరిగిన సమావేశం అనంతరం సీఎం షిండే తెలిపారు. మరాఠా సామాజిక వర్గానికి కోటా కల్పించడంలో ఉద్యమకారుడు జారంగే ప్రభుత్వానికి సహకరించాలని, మరాఠాలు సంయమనం పాటించాలని సీఎం కోరారు. రిజర్వేషన్ల అమలుకు చట్టపరమైన విధానాలకు ప్రభుత్వానికి సమయం కావాలని షిండే అన్నారు. ఈ తీర్మానంపై ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, శివసేన (యూబీటీ) నేత అనిల్ పరబ్, రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత విజయ్ వాడెట్టివార్, శాసన మండలిలో అంబాదాస్ దాన్వే తదితరులు సంతకాలు చేశారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఐదు మరాఠ్వాడా జిల్లాల్లో రాష్ట్ర బస్సు సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయి. సోమవారం బీడ్‌లోని కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించడంతో పాటు ఇంటర్నెట్ సేవలు రద్దయ్యాయి. ఇక్కడ నిరసనకారులు రాజకీయ నాయకుల ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నారు. హింసకు పాల్పడవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసిన సీఎం... రాజకీయ పార్టీలు కూడా పరిస్థితిని మరింత దిగజార్చేలా ఎలాంటి కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని కోరారు. ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేందుకు మార్గం సుగమం చేస్తూ, అర్హులైన మరాఠా కమ్యూనిటీ సభ్యులకు తాజాగా కున్బీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని సంబంధిత అధికారులను కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఒక ఉత్తర్వును జారీ చేసింది. ప్రభుత్వ తీర్మానం కున్బీలకు సంబంధించిన సూచనలు ఉన్న పాత పత్రాలను ఉర్దూ, 'మోడీ' లిపిలో (పూర్వ కాలంలో మరాఠీ భాష రాయడానికి ఉపయోగించబడింది) అనువదించాలని, ఈ పత్రాలను డిజిటలైజ్ చేసి, ధ్రువీకరించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. వ్యవసాయంతో అనుబంధం ఉన్న కున్బీలు మహారాష్ట్రలో ఓబీసీ వర్గం కింద వర్గీకరించబడ్డారు. విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ ప్రయోజనాలు పొందుతున్నారు. జాల్నా జిల్లాలోని అంతర్వాలి సరతి గ్రామంలో మరాఠా కోటా డిమాండ్ కోసం నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జారంగే మంగళవారం మాట్లాడుతూ మరాఠా సంఘం అసంపూర్తి రిజర్వేషన్‌ను అంగీకరించదని, ఈ అంశంపై మహారాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మరాఠా వర్గానికి 'పూర్తి' కోటా మంజూరు చేయకపోతే బుధవారం సాయంత్రం నుంచి తాగునీరు ఆపుతానని హెచ్చరించాడు.

ప్రతిపక్ష నేతలకు రక్షణ కల్పించాలి

లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాసిన మహువా మొయిత్రా

న్యూఢిల్లీ : తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాస్తూ అనేక మంది ప్రతిపక్ష నేతలు తమ ఐఫోన్‌లపై 'ప్రభుత్వ ప్రాయోజిత' దాడుల గురించి అందుకున్న హెచ్చరికలను ప్రస్తావించారు. ప్రతిపక్ష నాయకులు తమ విధులను కొనసాగించేందుకు రక్షణ కల్పించాలని కోరారు. 'ఈ ప్రభుత్వ చట్టవిరుద్ధమైన నిఘా' రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులపై అత్యంత దారుణమైన దాడి అని కృష్ణనగర్ ఎంపీ అన్నారు. మంగళవారం మొయిత్రా, శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాఘవ్ చద్దా, కాంగ్రెస్‌కు చెందిన శశి థరూర్, అతని పార్టీ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఏచూరితో సహా అనేక మంది ప్రతిపక్ష నాయకులు తమ ఐఫోన్‌లపై 'రాష్ట్ర ప్రాయోజిత' దాడుల గురించి యాపిల్ ద్వారా తమకు హెచ్చరికలు అందినట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సందేశాల స్క్రీన్ షాట్‌లను తమ 'ఎక్స్' ఖాతాలలో పోస్ట్ చేశారు. 'ప్రతిపక్ష నాయకులు 'రాష్ట్ర ప్రాయోజిత దాడి చేసే వారిచే లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారు పరికరాలను, సమాచారాన్ని, సందేశాలను, కెమెరా, మైక్రోఫోన్‌ను కూడా తమ అధీనంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు' అనే సందేశాన్ని అందుకున్నట్లు బిర్లాకు రాసిన లేఖలో మొయిత్రా పేర్కొన్నారు. '2019-2021లో వివిధ ప్రతిపక్ష సభ్యులు, అసమ్మతి జర్నలిస్టులు, పౌర సమాజ సభ్యుల పరికరాల్లోని సమాచారాన్ని పొందేందుకు ఉపయోగించే పెగాసస్ సాఫ్ట్‌వేర్ (ప్రభుత్వాలకు మాత్రమే విక్రయించబడింది) వెలుగులోకి రావడంతో ఈ ముప్పు రెట్టింపు దిగ్భ్రాంతిని కలిగిస్తుంది' అని ఆమె తెలిపారు. 'నేను లోక్‌సభలో ప్రాతినిధ్యం వహిస్తున్న అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీ ఈ లక్ష్యంలో ఒకరు. ప్రతిపక్షం ఈ అంశాన్ని సభలో లేవనెత్తినప్పటికీ, చర్చకు అనుమతి ఇవ్వలేదు. ఈ సంస్థ కూడా నిశ్చయాత్మక నివేదికను దాఖలు చేయలేదు' అని మొయిత్రా ఆ లేఖలో పేర్కొన్నారు. 'మేము ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత పార్లమెంటుకు ప్రతినిధులుగా ఉన్నాము. సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ప్రభుత్వం చేస్తున్న ఈ అక్రమ నిఘా మన గొప్ప ప్రజాస్వామ్య రాజ్యాంగం ద్వారా హామీ ఇవ్వబడిన మన ప్రాథమిక హక్కులపై అత్యంత దారుణమైన దాడి. మీరు లోక్‌సభకు సంరక్షకులు. ఈ హోదాలోనే అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించి, నిలదీయాల్సిన శక్తివంతమైన ప్రతిపక్షంగా మా విధులను కొనసాగించేందుకు అవసరమైన రక్షణను తక్షణమే అందించాలని నేను మిమ్మల్ని అడుగుతున్నాను' అని ఆమె తెలిపారు.

9 ఏళ్లలో చాలా చేశాం

బంగ్లాలో మూడు ప్రాజెక్టులు ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: కొన్ని దశాబ్దాలుగా చేయలేని ఎన్నో పనులను భారత్-బంగ్లాదేశ్ గడచిన 9 ఏళ్లలో చేశాయని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. రెండుదేశాల మధ్య సహకారం కొత్త శిఖరాలకు చేరుకుందని ఆయన వ్యాఖ్యానించారు. భారత్ సహకారంతో బంగ్లాదేశ్‌లో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోదీ బుధవారం బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ భారత్-బంగ్లాదేశ్ మధ్య సహకారం విజయవంతమైందన్నారు. కొన్ని దశాబ్దాలుగా చేయలేని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను 9 ఏళ్లలో రెండు దేశాలు కలిసి చేశాయని చెప్పారు. ఇది ఎంతో సంతోషించదగిన విషయమని ప్రధాని అన్నారు. భారత్ సహకారంతో బంగ్లాదేశ్ పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాల్లో అఖౌరా-అగర్తల క్రాస్ బోర్డర్ రైలు లింక్, ఖుల్నా-మొంగ్లా పోర్ట్ రైలు లైన్, మైత్రి సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఉన్నాయి. అఖౌరా-అగర్తల క్రాస్ బోర్డర్ రైలు లింక్ ప్రాజెక్ట్ పొడవు 12.24 కి.మీ. ఉంది. భారత్‌లో 6.78 కి.మీ, బంగ్లాదేశ్‌లో 5.46 కి.మీ మేర దీని నిర్మాణం జరిగింది.



భారత ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ కోసం రూ.392.52 కోట్లు ఖర్చు చేసింది. ఖుల్నా-మొంగ్లా పోర్ట్ రైలు లైన్ ప్రాజెక్ట్ వ్యయం 388.92 మిలియన్ డాలర్లు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఖుల్నా రైల్వే నెట్‌వర్క్‌ను బంగ్లాదేశ్‌లో రెండో అతిపెద్ద ఓడరేవు మొంగ్లా వరకు పొడిగించారు. దీని పొడవు 65 కి.మీ. ఇక మైత్రి సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా బంగ్లాదేశ్‌లోని ఖుల్నా డివిజన్‌లో గల రాంపాల్ వద్ద 1320 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్‌ప్లాంట్‌ను నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను బంగ్లాదేశ్-ఇండియా ఫ్రెండ్‌షిప్ పవర్ కంపెనీ లిమిటెడ్ చేపట్టింది.

మహారాష్ట్ర మంత్రి వాహనంపై దాడి

ముంబై: విద్యా, ఉద్యోగాల్లో మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలంటూ మహారాష్ట్రలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా రాష్ట్ర మంత్రి హసన్ ముష్రిఫ్ వాహనంపై కొందరు గుర్తు తెలియని దుండగులు బుధవారం దాడి చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ముంబైలోని ఎమ్మెల్యేల నివాసాల వద్ద రిజర్వేషన్ల అంశంపై ఆందోళనకారులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే మంత్రి హసన్ కారుపై దాడికి యత్నించారు. ఇనుప రాడ్లతో వాహనం అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనతో సంబంధమున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడి జరిగిన సమయంలో మంత్రి ఆ వాహనంలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో ప్రభుత్వం ఆయన భద్రతను పెంచింది. మరాఠా రిజర్వేషన్ల నేపథ్యంలో ఇటీవల ఎన్సీపీ ఎమ్మెల్యే ప్రకాశ్ సోలంకే నివాసంపై నిరసనకారులు దాడి చేసి నిప్పుపెట్టిన విషయం తెలిసిందే.

భారత కంపెనీల ప్రత్యక్ష విదేశీ 'లిస్టింగ్'కు ఓకే

న్యూఢిల్లీ: భారత కంపెనీలు విదేశీ ఎక్స్ఛేంజీల్లో ప్రత్యక్షంగా లిస్ట్ కావడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొన్ని షరతులకు లోబడి అనుమతులు ఇస్తున్నట్లు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు కంపెనీల (సవరణ) చట్టం 2020లో మార్పులు చేసినట్లు తెలిపింది. 2023 అక్టోబర్ 30 నుంచి ఇవి అమల్లోకి వచ్చినట్లు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ బుధవారం వెల్లడించింది. ప్రస్తుతం దేశీయ కంపెనీలు 'అమెరికన్ డిపాజిటరీ రిసీట్స్(ఏడీఆర్), 'గ్లోబల్ డిపాజిటరీ రిసీట్స్(జీడీఆర్) ద్వారా విదేశీ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అవుతున్నాయి. అయితే, విదేశీ ఎక్స్ఛేంజీల్లో దేశీయ కంపెనీల లిస్టింగ్‌కు సంబంధించిన నియమనిబంధనలను ప్రభుత్వం ఇంకా నోటిఫై చేయాల్సి ఉంది. లిస్టింగ్ నిబంధనల రూపకల్పనతో పాటు అర్హత ప్రమాణాలు ఇతరత్రా అంశాలపై మంత్రిత్వశాఖ కసరత్తు చేస్తోందని అక్టోబర్ 18న ఓ సీనియర్ ప్రభుత్వాధికారి వెల్లడించారు. ప్రపంచ మార్కెట్ల నుంచి మూలధనాన్ని సమకూర్చుకునేలా దేశీయ కంపెనీలు విదేశీ ఎక్స్ఛేంజీల్లో నేరుగా లిస్ట్ అయ్యేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు జులై 28న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. వాస్తవానికి కేంద్రం ఈ అంశాన్ని 2020లో కోవిడ్ ఉపశమన చర్యల్లో భాగంగా ప్రకటించింది. అహ్మదాబాద్ గిఫ్ట్ సిటీలోని 'ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్'లో లిస్ట్ అయ్యేందుకు దేశీయ కంపెనీలను తొలుత అనుమతించాలనేది ప్రణాళిక అని జులై 28న ఓ సీనియర్ ప్రభుత్వాధికారి తెలిపారు. తర్వాత నిర్దేశిత 8 నుంచి 9 విదేశీ పరిధుల్లో లిస్ట్ అయ్యేందుకు ఆమోదం తెలిపాలని యోచించినట్లు పేర్కొన్నారు. విదేశీ లిస్టింగ్‌కు సంబంధించి పటిష్ఠమైన అక్రమ నగదు చలామణీ నియంత్రణలతో కూడిన కార్యాచరణను సెబీ గతంలోనే ప్రతిపాదించింది. ఎన్‌వైఎస్ఈ, నాస్డాక్, ఎల్ఎస్ఈ, హాంకాంగ్, జపాన్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్, కెనడాలో లిస్టింగ్‌ను సెబీ సిఫార్సు చేసింది.

విపక్ష ఎంపీలను ఎవరో ఆట పట్టించారు

హ్యాకింగ్ వివాదంపై పీయూష్ గోయల్

న్యూఢిల్లీ: తమ యాపిల్ ఫోన్లలో హ్యాకింగ్ అలర్ట్‌లు వచ్చాయంటూ విపక్షనేతలు చేసిన ఆరోపణలు కలకలం సృష్టించాయి. ఈ ఆరోపణలను కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తేలిగ్గా కొట్టిపారేశారు. విపక్ష నేతలను ఎవరో సరదాగా ఆటపట్టించి ఉండొచ్చని చెప్పుకొచ్చారు. 'విపక్ష నేతలను ఎవరో ఆటపట్టించి ఉంటారని నేను అనుకుంటున్నా. దానిపై వారు ఫిర్యాదు చేయాలి. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది' అని మీడియా అడిగిన ప్రశ్నకు గోయల్ బుధవారం సమాధానం ఇచ్చారు. అదేసమయంలో విపక్షాలపై విమర్శలు గుప్పించారు. విపక్ష పార్టీలు బాగా బలహీనంగా ఉన్నాయని, అందుకే ఆ పార్టీల నేతలు ప్రతిదాంట్లో కుట్రకోణాన్ని చూస్తున్నారని గోయల్ ఎదురుదాడి చేశారు. ఇది ఏదో లోపం వల్ల జరిగి ఉండొచ్చని, 150 దేశాల్లోని ప్రజలకు ఈ సందేశం వచ్చినట్లు యాపిల్ సంస్థే స్వయంగా వెల్లడించిందని, దీనినిబట్టి చూస్తే ప్రపంచవ్యాప్తంగా హ్యాకర్లు చురుగ్గా ఉన్నట్లు కనిపిస్తోందని తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతామని చెప్పారు. విపక్ష నేతల పరిస్థితి ఏమిటో దేశమంతా తెలుసని గోయల్ ఎద్దేవా చేశారు. విపక్ష నేతలు అంతర్గత పోరులో చిక్కుకుపోయి ఉన్నారని, వారు ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు తమ బలహీనతలను సమీక్షించుకోవాలని ఎదురుదాడికి దిగారు. ఫోన్ల హ్యాకింగ్ వ్యవహారంలో ప్రభుత్వం పాత్ర ఏమీ లేదని చెప్పుకొచ్చారు.

బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలను బెదిరిస్తోంది

తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడులు చేసేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి ప్రతిపక్ష పార్టీలను బెదిరిస్తోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ బుధవారం ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించిన పార్టీలు బెదిరింపులకు గురవుతున్నాయని, తాజాగా 'ఫోన్ ట్యాపింగ్' ఘటన జరిగిందని ఆయన అన్నారు. 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు అభిప్రాయాలు వ్యక్తం చేసినా బెదిరిస్తారు. వారిపై ఆదాయపు పన్ను శాఖ (ఐటీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ను ఉపయోగించారు. ఐఫోన్ తయారీదారు ప్రతిపక్ష నేతలకు భద్రతా నోటిఫికేషన్‌ను జారీ చేయడంతో ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది' అని పార్టీ శాసనసభ్యుడు ఎ.కృష్ణస్వామి కుమార్తె వివాహ వేడుక తర్వాత స్టాలిన్ ఇక్కడ అన్నారు. భద్రతా నోటిఫికేషన్ తర్వాత ఘటనపై విచారణ జరుపుతామని కేంద్ర మంత్రి ఒకరు తెలిపారని అన్నారు. 'ఎన్నికలకు వెళుతున్న ఐదు రాష్ట్రాలలో బీజేపీలో ఓటమి బయటపడిందని నేను భావిస్తున్నాను. మాకు అందిన సమాచారం ప్రకారం మొత్తం ఐదు రాష్ట్రాల్లో బీజేపీ ఘోర పరాజయాన్ని చవిచూడనుంది. అందుకే, ఓటమి భయంతో కేంద్రం ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకుంటోంది' అని డీఎంకే అధ్యక్షుడు తెలిపారు. 'ఇండియా' కూటమి బీజేపీ కవచంలో ఉన్న చిచ్చును బయటపెడుతుంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిని నిర్ధారిస్తుంది. వచ్చే ఏడాది జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో కూటమికి అఖండ విజయం సాధించిపెట్టేలా కృషి చేయాలి' అని ఆయన తన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

కేజ్రీవాల్‌ని అరెస్ట్ చేస్తే... జైలు నుంచే పాలన

ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ని ఈడీ అరెస్ట్ చేస్తే... ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం జైలు నుంచే పని చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత సౌరభ్ భరద్వాజ్ అన్నారు. కేజ్రీవాల్‌ని అరెస్ట్ చేస్తారన్న వార్తల నేపథ్యంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. కేజ్రీవాల్‌ని నవంబర్ 2న ఈడీ అధికారులు అరెస్ట్ చేయాలని చూస్తున్నారని అనుమానం వ్యక్తంచేశారు. ఇందులో భాగంగా విచారణ కోసం రేపు ఉదయం రావాలని ఈడీ అధికారులు ఆదేశించినట్లు తెలిపారు. కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం అరెస్టు చేసే అవకాశం ఉందని ఆప్ మంగళవారం ఆందోళన వ్యక్తం చేసింది. మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, మరో ఇద్దరు సీనియర్ ఆప్ నేతలు ఇప్పటికే జైలులో ఉన్నారు. కేజ్రీవాల్ జైలుకు వెళితే పార్టీ వ్యూహం ఏమిటనే ప్రశ్నకు స్పందించిన భరద్వాజ్... అంతర్గతంగా చర్చించి నేతలు భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తారని చెప్పారు. పార్టీ నేతలంతా జైలులో ఉంటే... అప్పుడు ప్రభుత్వం, పార్టీ జైలు నుంచి పని చేస్తాయి. బీజేపీ కోరుకుంటోంది అదే. ఉచిత విద్య, ఉచిత విద్యుత్, ఉచిత నీరు, ఆసుపత్రులు, మొహల్లా క్లినిక్‌లు నిలిపివేయాలని బీజేపీ కోరుకుంటున్నది. అయితే అరవింద్ కేజ్రీవాల్ ఎట్టి పరిస్థితుల్లో బీజేపీ కుట్రలను సాగనివ్వరు. బీజేపీకి ఎవరు అడ్డంకిగా మారారో వాళ్లను, వాళ్ల పార్టీ నేతలను ఏదో విధంగా జైలుకు పంపుతారు. ఆ పార్టీ హయాంలో ఎలాంటి ఆధారాలు లేకుండా ఏళ్లతరబడి జైళ్లలో మగ్గుతూ శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను చూస్తున్నాం. ఈ సమయంలో చట్టాన్ని నమ్ముకుంటాం. చట్టాలను దుర్వినియోగం చేయడానికి బీజేపీ ప్రయత్నించినా... కోర్టులు ఆ పార్టీకి మొట్టికాయలు వేస్తాయని అన్నారు.

'హ్యాక్ అలర్ట్' దుమారం...

యాపిల్‌కు పార్లమెంటరీ కమిటీ సమన్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా చాలామంది విపక్ష నేతల ఐఫోన్లకు 'హ్యాక్ అలర్ట్ మెసేజ్‌లు రావడం తీవ్ర దుమారం చెలరేగింది. 'ప్రభుత్వ ప్రాయోజిత వ్యక్తులు హ్యాకింగ్‌కు ప్రయత్నిస్తున్నారు' అంటూ ఆ సందేశం ఉండటంతో కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు మండిపడ్డాయి. ఫోన్ల హ్యాక్ అలర్ట్ ఘటనను తీవ్రంగా పరిగణించిన కేంద్రం తమ దర్యాప్తును వేగవంతం చేసింది.

దీనిపై వివరణ కోరుతూ యాపిల్ సంస్థకు సమన్లు జారీ చేయాలని పార్లమెంటరీ కమిటీ భావిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఐటీశాఖపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయి సంఘం రాబోయే సమావేశంలో ఈ 'హ్యాక్ అలర్ట్' అంశంపై చర్చించనుందని కమిటీ సెక్రటేరియట్ ఆఫీసు వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనపై స్టాండింగ్ కమిటీ ఆందోళన వ్యక్తం చేసిందని, దీన్ని చాలా తీవ్రంగా పరిగణించిందని తెలిపాయి. ఈ వ్యవహారంపై యాపిల్ ప్రతినిధులకు సమన్లు జారీ చేయాలని కమిటీ యోచిస్తున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. తమ యాపిల్ ఫోన్లను హ్యాక్ చేసేందుకు ప్రభుత్వ ప్రాయోజిత వ్యక్తుల ద్వారా ప్రయత్నం జరిగిందని విపక్ష నేతలు ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కేంద్ర ఐటీ శాఖ... హ్యాకింగ్ ప్రయత్నం జరిగినట్లు వ్యక్తమైన అనుమానాలపై నిగ్గు తేల్చేందుకు 'కంప్యూటర్ అత్యవసర స్పందన బృందం' (సీఈఆర్‌టీ) ద్వారా సమగ్ర సాంకేతిక విచారణ జరుపుతామని వెల్లడించింది. అటు యాపిల్ కూడా దీనిపై స్పందించింది. నోటిఫికేషన్లను ప్రభుత్వ ప్రాయోజిత వ్యక్తులకు ఆపాదించలేమని తెలిపింది.

యాపిల్ యూజర్లను ముందే హెచ్చరించాం: కేంద్రం

న్యూఢిల్లీ: యాపిల్ ఫోన్ల హ్యాకింగ్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అయితే, దీనికి ముందే యాపిల్ యూజర్లను అప్రమత్తం చేసినట్లు కేంద్రం చెబుతోంది. తమ యాపిల్ ఫోన్లు హ్యాక్ చేసేందుకు ప్రభుత్వ ప్రాయోజిత వ్యక్తులు యత్నించారంటూ విపక్షనేతలు ఆరోపించడం కలకలం రేపింది. మహువా మొయిత్రా, ప్రియాంక చతుర్వేది, శశిథరూర్, రాఘవ్ చడ్డా వంటి నేతలు ఆందోళన వెలిబుచ్చారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం... సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని ప్రకటించింది. యాపిల్ ఉత్పత్తుల్లో భద్రతాపరమైన లోపాలు ఉన్నట్లు గుర్తించి కేంద్రం హెచ్చరిక జారీ చేసింది. ప్రభుత్వానికి చెందిన కంప్యూటర్ అత్యవసర స్పందన బృందం(సెర్ట్) యాపిల్ యూజర్లకు ఇటీవల ఓ అడ్వైజరీ జారీ చేసింది. ఐఫోన్, యాపిల్ వాచ్, మ్యాక్‌బుక్ ఆపరేటింగ్ సిస్టమ్‌లతో పాటు సఫారీ బ్రౌజర్‌లోనూ సెక్యూరిటీ లోపాలు గుర్తించినట్లు సెర్ట్ పేర్కొంది. ఐఓఎస్, ఐప్యాడ్ ఓఎస్ 17.1 కంటే ముందు వెర్షన్లు, మ్యాక్ ఓఎస్ సోనోమా వెర్షన్ 14.1 కంటే ముందు వెర్షన్లు, వెంట్యూరా వెర్షన్ 13.6.1, మానిటరీ వెర్షన్స్ 12.7.1 కంటే ముందు వెర్షన్లలో లోపాలు ఉన్నట్లు తెలిపింది. యాపిల్‌కు చెందిన ఇంటర్నెట్ బ్రౌజర్ సఫారీ 17.1 కంటే ముందు వెర్షన్లలో లోపాలు గుర్తించినట్లు సెర్ట్ వివరించింది. ఆయా ఉత్పత్తుల్లో బహుళ లోపాలు ఉన్నట్లు సెర్ట్ గుర్తించింది. దీంతో హ్యాకర్లు డివైజ్‌లను నియంత్రణలోకి తీసుకుని సున్నితమైన సమాచారాన్ని తస్కరించే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు అక్టోబర్ 27న సెర్ట్ అడ్వైజరీని జారీ చేసింది. అంతకుముందూ ఇదే తరహా అలర్ట్ జారీ చేసింది. వెంటనే లేటెస్ట్ ఐఓఎస్, మ్యాక్ ఓఎస్, టీవీ ఓఎస్, వాచ్ ఓఎస్‌తో పాటు సఫారీ బ్రౌజర్‌ను అప్‌డేట్ చేసుకోవాలని యూజర్లకు సూచించింది. ఈ హెచ్చరిక వెలువడిన రోజుల వ్యవధిలోనే ప్రతిపక్ష ఎంపీలకు వార్నింగ్ సందేశాలు రావడం గమనార్హం.

ఫోన్ల హ్యాకింగ్‌పై బీజేపీ ఎదురుదాడి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా విపక్ష నేతల ఐఫోన్లకు హ్యాక్ అలర్ట్ సందేశాలు రావడంతో కేంద్రంపై కాంగ్రెస్ విరుచుకుపడింది. కాంగ్రెస్ చేస్తోన్న విమర్శలపై బీజేపీ ఎదురుదాడికి దిగింది. కాంగ్రెస్ పార్టీకి గతం గుర్తులేదా అంటూ ప్రశ్నించింది. యాపిల్ ఫోన్ల హ్యాకింగ్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం స్పందిస్తూ విపక్ష నేతలకు అలర్ట్ మెసేజ్‌లు రావడం విస్మరించలేనిదని, విపక్ష నేతలకు మాత్రమే ఎందుకు ఈ సందేశాలు వచ్చాయని ప్రశ్నించారు. విపక్ష నేతల ఫోన్లపై ఎవరు ఆసక్తి చూపుతారని నిలదీశారు. పెగాసస్ మిస్టరీ తర్వాత ప్రస్తుతం వేళ్లన్నీ ప్రభుత్వం వైపే చూపిస్తున్నాయని చిదంబరం విమర్శించారు. దీనిపై బీజేపీ ఐటీ విభాగం అధినేత స్పందిస్తూ అప్పటి ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ తన కార్యాలయంలో బగ్‌ను చొప్పించారనే అనుమానాన్ని వ్యక్తం చేశారని గుర్తుచేశారు. 2008 నుంచి 2012 మధ్య కాంగ్రెస్ హయాంలో చిదంబరం కేంద్ర హోంమంత్రిగా విధులు నిర్వర్తించారు. 2009 నుంచి 2012 మధ్య ప్రణబ్ ముఖర్జీ ఆర్థికమంత్రిగా సేవలు అందించారు. ఈ క్రమంలో 2011లో జాతీయ మీడియాలో ప్రచురితమైన కథనాన్ని ప్రస్తావిస్తూ ప్రణబ్ ముఖర్జీ తన కార్యాలయంలో బగ్‌ను చొప్పించారనే అనుమానాన్ని వ్యక్తం చేశారని, దానిపై విచారణ జరిపించాలని కోరారని మాలవీయ ట్వీట్ చేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత మంత్రే ఆరోపణలు చేశారనే ఉద్దేశంతో ఈ విషయాన్ని మాలవీయ గుర్తుచేశారు.

ఏపీ సహా వివిధ రాష్ట్రాలకు మోదీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవం (నవంబరు 1) సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయా రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం 'ఎక్స్'లో తన సందేశాన్ని పోస్ట్ చేశారు. ఏపీ గురించి ప్రస్తావిస్తూ... రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభసందర్భంగా, ఈ చైతన్యవంతమైన రాష్ట్ర ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. వారి అసాధారణమైన ప్రతిభ, అచంచలమైన సంకల్పం, దృఢమైన పట్టుదలతో, ఆంధ్రప్రదేశ్ ప్రజలు విభిన్న రంగాలలో తమదైన ముద్ర వేశారు. వారి నిరంతర శ్రేయస్సు, విజయం కోసం నేను ప్రార్థిస్తున్నానని మోదీ పేర్కొన్నారు. అలాగే ఏపీతో పాటు ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న మధ్యప్రదేశ్, హరియాణా, చత్తీస్‌గఢ్, కర్నాటక, కేరళ రాష్ట్రాల ప్రజలకు కూడా మోదీ తన శుభాకాంక్షలను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 1956లో తొలిసారిగా రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం భాషాపరంగా అనేక రాష్ట్రాలు ఏర్పడ్డాయి. 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్నాటక, మధ్యప్రదేశ్ ఏర్పాటయ్యాయి. 1966లో హరియాణా ప్రత్యేక రాష్ట్రంగా విభజించబడగా... 2002లో చత్తీస్‌గఢ్‌కు రాష్ట్ర హోదా లభించింది.

కార్మికులను కట్టు బానిసలుగా చేయడానికే

గనుల ప్రైవేటీకరణ

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- సింగరేణి జోలికొస్తే ఊరుకోబోమని వెల్లడి

న్యూఢిల్లీ: తెలంగాణలో సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది కార్మిక చట్టాలను ఉల్లంఘించడమేనని, కార్మికులను నిర్బంధ శ్రమలోకి నెట్టడమేనని విమర్శించారు. సింగరేణి గనుల ప్రైవేటీకరణను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులతో ఇటీవల తాను సంభాషించిన వీడియోను బుధవారం ఆయన తన యూట్యూబ్ ఛానల్‌లో షేర్ చేశారు. వ్యూహాత్మక రంగాలలో ప్రైవేటీకరణ ఉండకూడదనేది కాంగ్రెస్ వైఖరి అని ఈ వీడియోలో స్పష్టం చేశారు. కొంతమంది పెట్టుబడిదారులకు ఉద్దేశించిన ఇటు వంటి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వైఖరిని పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో స్పష్టం చేయాలని కార్మికులు రాహుల్ గాంధీని కోరారు. ఈ వీడియో తోపాటు ఆయన తన వ్యాఖ్యలను పోస్టు చేశారు.

'కొద్దిరోజుల క్రితం సింగరేణి బొగ్గు గనుల కార్మికులు, ఉద్యోగులను కలుసుకుని మాట్లాడే అవకాశం లభించింది. వారి సమస్యలు విన్న తర్వాత ప్రతి సమస్యకు గనుల ప్రైవేటీకరణే మూలమని తెలిసింది' అని తెలిపారు. ఈ ప్రైవేటీకరణ అనేది కార్మిక చట్టాలను ఉల్లంఘించడమే కాక కార్మికులను కట్టు బానిసలుగా చేయడానికి ఒక సాధనం. కొంతమంది పెట్టుబడిదారులు దీని నుండి ప్రయోజనం పొందుతారు. ఫలితంగా నేను చాలా కాలంగా చెబుతున్నట్లుగా ధనికులు మరింత ధనవంతులు అవుతారు. పేదలు మరింత పేదవారవుతారని రాహుల్ పేర్కొన్నారు. ఇదే విషయమై 'ఎక్స్'లో హిందీలో ట్వీట్ చేసిన రాహుల్ గాంధీ... 'సింగరేణి బొగ్గు గనుల కార్మికులను కలిసిన తర్వాత, వారిని కొల్లగొట్టడం పెద్ద కుట్రలో భాగమని తేలింది' అని అన్నారు. "భారతీయ గనుల ప్రైవేటీకరణ, విదేశాల నుంచి అధిక ధరకు బొగ్గు తీసుకురావడం, ఆ తర్వాత ప్రజాధనాన్ని జేబులో వేసుకునేందుకు కరెంటు బిల్లును పెంచడం ద్వారా దేశాన్ని చెద పురుగులాగా తొలిచేసే నిగూఢ పన్నుని ప్రధాని మోపారు" అని రాహుల్ విమర్శించారు. గత నెలలో తెలంగాణ పర్యటన సందర్భంగా సింగరేణి కార్మికులను కలుసుకున్న రాహుల్ గాంధీ... సింగరేణి కాలరీస్ బొగ్గు గనులను ప్రైవేటీకరించబోమని హామీ ఇచ్చారు. దానిని అదానీకి విక్రయించే ప్రయత్నం జరుగుతోందని... కానీ తాము దానిని అడ్డుకున్నామని తెలిపారు.



రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

న్యూఢిల్లీ: దేశంలో మరోసారి జీఎస్టీ వసూళ్లు భారీగా నమోదయ్యాయి. అక్టోబర్ నెలకుగాను రూ.1.72 లక్షల కోట్లు వసూలయ్యాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది ఏప్రిల్‌లో నమోదైన రూ.1.87 లక్షల కోట్లు అత్యధికం కాగా... తాజా వసూళ్లు రెండో అత్యధికంగా నిలిచాయి. గతేడాదికి సంబంధించి రూ.1.66 లక్షల కోట్లతో పోలిస్తే వసూళ్లు 13 శాతం మేర పెరిగాయి. అక్టోబర్ నెల మొత్తం వసూళ్లలో సీజీఎస్టీ రూపంలో రూ.30,062 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూ.38,171 కోట్లు సమకూరినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఐజీఎస్టీ రూపంలో రూ.91,315 కోట్లు రాగా... రూ.12,456 కోట్లు సెస్సుల రూపంలో వచ్చినట్లు వివరించింది. ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ అనంతరం అక్టోబర్ నెలకు కేంద్రానికి రూ.72,934 కోట్లు, రాష్ట్రాలకు రూ.74,785 కోట్ల ఆదాయం సమకూరినట్లు వెల్లడించింది. కాగా, జీఎస్టీ వసూళ్లలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండంకెల వృద్ధిని నమోదు చేశాయి. గతేడాది ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ వసూళ్లు రూ.7,347 కోట్ల నుంచి 11 శాతం వృద్ధితో రూ.8,127 కోట్లకు పెరిగాయి. సెటిల్‌మెంట్ అనంతరం రూ.18,488 కోట్ల ఆదాయం సమకూరింది. తెలంగాణ సీజీఎస్టీ వసూళ్లు రూ.9,538 కోట్లు కాగా... ఈ ఏడాది రూ.11,377 కోట్లకు పెరిగాయి. అంటే 19 శాతం వృద్ధి నమోదైంది. సెటిల్‌మెంట్ అనంతరం రూ.23,478 కోట్లు ఆదాయం వచ్చింది. సెటిల్‌మెంట్ అనంతరం మహారాష్ట్రకు అత్యధికంగా రూ.84,712 కోట్ల ఆదాయం వచ్చింది.

కులం, మతం పేరిట బీజేపీ నయవంచన: ఖర్గే

రాయ్‌పూర్: కులం, మతం పేరుతో ప్రజలను బీజేపీ మభ్యపెడుతున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. దేశం కోసం త్యాగాలు చేసిన కాంగ్రెస్‌ను విమర్శించడమే బీజేపీ పనిగా పెట్టుకుందన్నారు. దేశం కోసం ప్రాణాలు త్యజించిన మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ వంటి వారు బీజేపీకి ఉన్నారా అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తారని దుయ్యబట్టారు. చత్తీస్‌గఢ్, సుక్మా జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఖర్గే మాట్లాడుతూ బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివాసీ మహిళను రాష్ట్రపతి చేశామని గొప్పలు చెబుతూ బీజేపీ నేతలు ప్రజలను మాయ చేయాలని చూస్తున్నారని అన్నారు. దేశానికి తొలి మహిళా ప్రధానిని కాంగ్రెస్ పార్టీ అందించిందని, బీసీల సాధికారతకు కాంగ్రెస్ కృషి చేసిందని చెప్పారు. ఎన్నికల్లో గెలవడమే కాదు..దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, సమాజాన్ని కాపాడే బాధ్యతను నిర్వర్తిస్తామన్నారు. 70 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని మోదీ అడుగుతుంటారని, తాము దేశాన్ని నిర్మించామని, స్కూళ్లు, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, పరిశ్రమలు వంటివి ఎన్నింటినో తీసుకువచ్చి దేశాభివృద్ధికి పునాదులు వేశామని గుర్తుచేశారు. చత్తీస్‌గఢ్‌లో మోదీ స్కూళ్లు నిర్మించారా అని ఖర్గే ప్రశ్నించారు. గతంలో స్కూళ్లు, బ్యాంకులు, ఉద్యోగాలు ఏమీ లేవని, అవన్నీ తమ పాలన హయాంలోనే తీసుకువచ్చామని కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్తుచేశారు.

మహువా మొయిత్రా పార్లమెంటరీ ఖాతాలోకి

దుబాయ్ నుంచి 47 సార్లు లాగిన్

న్యూఢిల్లీ: టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పార్లమెంటరీ ఖాతాను దుబాయ్ నుంచి 47 సార్లు వినియోగించినట్లు వెల్లడైంది. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఈమేరకు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇప్పటికే డబ్బు తీసుకొని ప్రశ్నలు అడిగారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న మహువా మొయిత్రాపై కేసు విచారణ సమయంలో ఈ పరిణామాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే స్పందిస్తూ 'దుబాయ్‌లోని వ్యాపారవేత్త హీరానందానికి చెందిన ప్రదేశాల నుంచి మహువా లోక్‌సభ ఖాతాలోకి 47 సార్లు లాగిన్ అయినట్లు, అక్కడి నుంచే అనేక ప్రశ్నలు సంధించినట్లు వచ్చిన వార్తలు నిజమే అయితే దేశవ్యాప్తంగా ఎంపీలంతా ఆమె అవినీతిని వ్యతిరేకించాలి' అని ట్వీట్ చేశారు. హీరానందని స్వప్రయోజనాల కోసం ఆయనే ఈ ప్రశ్నలు అడిగారని రుజువైనట్లేనని, పెట్టుబడిదారుల స్వార్థ ప్రయోజనాల కోసం ఎంపీలుగా పనిచేస్తున్నామా అని దుయ్యబట్టారు. లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు వ్యాపారవేత్త దర్శన్ హీరానందాని నుంచి మహువా మొయిత్రా డబ్బులు తీసుకున్నారని నిషికాంత్ దూబే ఆరోపించిన విషయం తెలిసిందే. అటు హీరానందాని కూడా మహువాకు లంచం ఇచ్చానని అంగీకరించినట్లుగా ఆయన పేరుతో ఓ అఫిడవిట్ బయటికొచ్చింది. ఈ ఆరోపణలను మహువా తీవ్రంగా ఖండించారు. హీరానందానికి తన లాగిన్ క్రెడెన్షియల్స్ ఇచ్చిన మాట వాస్తవమే కానీ అందులో దురుద్దేశం లేదన్నారు. ప్రశ్నలన్నీ తానే అడిగానని పేర్కొన్నారు. అంతేగాక, హీరానందానితో కేంద్రం బలవంతంగా ఆ అఫిడవిట్‌పై సంతకం చేయించిందని మహువా ఆరోపించారు. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన లోక్‌సభ ఎథిక్స్ కమిటీ ఆమెకు సమన్లు జారీ చేసింది. ఈ క్రమంలోనే ఆమె గురువారం కమిటీ ఎదుట హాజరుకానున్నారు. తనకు లంచం ఇచ్చానని హీరానందాని అంగీకరించినట్లుగా ఉన్న అఫిడవిట్‌పై ఆయనను ప్రశ్నించేందుకు అవకాశం ఇవ్వాలని మహువా ఎథిక్స్ కమిటీని కోరారు.

దివ్యాంగుల వినోదానికి చర్యలేవి?

కేంద్రమంత్రి ఠాకూర్‌కు సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం లేఖ

న్యూఢిల్లీ: వినోదాన్ని ఆశ్వాదించే హక్కు ప్రతి పౌరునికి ఉంటుందని సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం అన్నారు. దేశంలో అంధులు, బదిరుల జనాభా ఎక్కువని, వారికి వినోద మార్గాలు లేవని తెలిపారు. ఇందుకోసం ఉన్న చట్టం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఇదే అంశమై ఆయన బుధవారం కేంద్ర సమాచారం, ప్రసారాల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌కు ఓ లేఖ రాశారు. దివ్యాంగుల వినోదానికి చర్యలు తీసుకోవాలని కోరారు. థియేటర్లు, ఇతర వినోద ప్రాంతాలకు దివ్యాంగులు దూరమవుతున్నారని, దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 అమలు జరగడం లేదని తెలిపారు. అక్షత్ బల్దా వర్సెస్ యష్ రాజ్ ఫలిమ్స్ కేసు విచారణలో దివ్యాంగులకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీ హైకోర్టు గుర్తించిందని వినయ్ విశ్వం తెలిపారు. భాగస్వాములతో సంప్రదింపులు జరిపి అవసరమైన మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్ర సమాచార, ప్రసారాల శాఖకు కోర్టు అప్పట్లో ఆదేశాలివ్వడాన్ని గుర్తుచేశారు. ఆడియో వివరణ, క్యాప్షన్లు, ర్యాంపులు తదితర సౌకర్యాలతో దివ్యాంగులు కూడా వినోదాన్ని ఆశ్వాదించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. థియేటర్, సినిమా, ఓటీటీ మాధ్యమాలతో పాటు ఇతరత్రా వినోదాలు అందే విధంగా భాగస్వాములతో సంప్రదింపులు జరిపి మార్గదర్శకాలు రూపొందించి దివ్యాంగులకు న్యాయం చేయాలని లేఖలో ఠాకూర్‌ను విశ్వం కోరారు.

బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: బంగాళాఖాతంలోని యుద్ధనౌక నుంచి సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్‌ను భారత నావికాదళం బుధవారం విజయవంతంగా పరీక్షించింది. కార్యాచరణ సంసిద్ధత కోసం జరిపిన టెస్ట్ ఫైరింగ్ సకాలంలో లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకుంది. భారత నావికాదళానికి చెందిన తూర్పు కమాండ్‌లోని బంగాళాఖాతంలో ఫైరింగ్ జరిగినట్టు అధికారులు వెల్లడించారు. ఆర్-క్లాస్ డిస్ట్రాయిర్ షిప్, దాని ఆయుధాలు పూర్తిగా దేశీయంగా తయారై ఆత్మనిర్భర్ భారత్‌కు, సముద్రంలో భారత నేవీ ఫైర్ పవర్‌కు సంకేతంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా చైనా పీఎల్‌ఏ నేవీ నుంచి ఎదురయ్యే ప్రతికూలతలతో సహా అన్ని సవాళ్లను ఇవి సమర్థవంతంగా ఎదుర్కోనున్నాయి. కాగా, బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఉన్నతాధికారుల సమాచారం ప్రకారం భారత్-రష్యా సంయుక్త వెంచర్‌గా సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులను ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిని జలాంతర్గాములు, నౌకలు, విమానాలు, ల్యాండ్ ప్లాట్‌ఫాం నుంచి 2.8 మ్యాక్ వేగంతో, దాదాపు మూడు రెట్ల ధ్వని వేగంతో ప్రయోగించవచ్చు. ఫిలిప్పీన్స్ వంటి కొన్ని దేశాలకు కూడా బ్రహ్మోస్ క్షిపణులను భారత్ ఎగుమతి చేస్తోంది.

బీజేపీది విపక్ష నేతల్ని జైలుకు పంపే కుట్ర

కోల్‌కతా: వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో ప్రతిపక్షం అన్నదే లేకుండా చేసి మొత్తం ఓట్లు దండుకోవాలని బీజేపీ కుట్ర చేస్తోందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో తమకు పోటీగా ఎవరూ ఉండరాదని భావిస్తోందన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు, అనేక మంది నేతలకు నోటీసులు జారీ కావడం, ప్రతిపక్ష పార్టీల ఎంపీల ఫోన్ల హ్యాకింగ్ తదితర పరిణామాల క్రమంలో ఆమె పై విధంగా స్పందించారు. అదే సమయంలో పశ్చిమ బెంగాల్‌కు రావాల్సిన ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ నిధుల కోసం కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అందుకోసం గడువు నవంబరు ఒకటితో ముగియగా 16వ తేదీ వరకు పొడిగించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులివ్వడంపై కేంద్రంతో చర్చిస్తానని గవర్నర్ ఆనందా బోస్ హామీనిచ్చినట్లు మమత తెలిపారు. ఇదే అంశమై నవంబరు 15న నేతాజీ ఇండోర్ స్టేడియంలో సమావేశాన్ని నిర్వహించి, తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తామని టీఎంసీ అధినేత్రి వెల్లడించారు.

ఆ ఘనత ప్రభుత్వానిదే... పార్టీలది కాదు: నితీశ్

పాట్నా: ప్రభుత్వ విజయాలను పార్టీలకు ఆపాదించడం సరైన పద్ధతి కాదని బీహార్ సీఎం నితీశ్ కుమార్ అన్నారు. బీహార్ రాష్ట్ర పవర్ (హోల్డింగ్) కంపెనీ లిమిటెడ్ 11వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రూ.14వేల కోట్ల విలువైన విద్యుత్ ప్రాజెక్టులను నితీశ్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోని మహా కూటమి ప్రభుత్వంలోని పార్టీలు తమ ప్రతిష్టను పెంచుకోవడానికి ప్రభుత్వం సాధించిన విజయాలను ఉపయోగించుకోవడాన్ని ఖండించారు. 'నా మంత్రులలో చాలామంది ప్రభుత్వం చేసిన మంచికిగాను ఘనతను వారి పార్టీలకు ఇవ్వడాన్ని గమనించా. ఇది సరైనది కాదు' అని పరోక్షంగా ఆర్జేడీ మంత్రులను విమర్శించారు. తన పార్టీకి చెందిన మంత్రి బిజేంద్ర యాదవ్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. అధికారంలో ఉన్నంత వరకు యాదవ్ పదవిలో ఉంటారన్నారు. అందుకు ఆయన నిరాకరిస్తే తాను కూడా అంతా వదిలేస్తానని నితీశ్ కుమార్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో జనతాదళ్ (యునైటెడ్)కు చెందిన విద్యుత్ మంత్రి బిజేంద్ర యాదవ్, కీలకమైన రెవెన్యూ, భూ సంస్కరణల శాఖ కలిగిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అగ్రనేత అలోక్ మెహతా తదితరులు పాల్గొన్నారు.

అప్పు తీర్చమన్న బ్యాంకు సిబ్బందిపై దాడి

లక్నో: అప్పు తీర్చాలని కోరిన బ్యాంకు సిబ్బందిని రుణ ఎగవేతదారుడు, అతడి కుటుంబ సభ్యులు దాడి చేశారు. కర్రలు, రాళ్లతో కొట్టారు. అంతటితో ఆగక వారిని నిర్బంధించారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో జరిగింది. పథమ గ్రామీణ బ్యాంకు బల్పూర్ శాఖ సిబ్బంది సోన్వారా గ్రామానికి వెళ్లి కిసాన్ క్రెడిట్ కార్డు రుణ గ్రహీత ఘనశ్యామ్ ఇంటికి వెళ్లి బకాయిలు తీర్చాలని కోరారు. ఘనశ్యామ్, అతడి కుటుంబ సభ్యులు కలిసి బ్యాంకు సిబ్బందిపై దాడి చేసి వారిని నిర్బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి బ్యాంకు సిబ్బందిని విడిపించారు. గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వారిపై దాడి చేసిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.